2015 సెప్టెంబర్

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక క్రైస్తవ మాసపత్రిక

ప్రధాన సంపాదకులు :

**రెవ.డా॥ కె. జోసఫ్**

సర్క్యులేషన్ :

**సామ్రాట్ కొడవటికంటి**

**చందా వివరములు :**
సంవత్సర చందా రూ. 150/-
పోషక చందా రూ. 1000/-
జీవిత చందా రూ. 3000/-
విడి ప్రతి రూ. 15/-

**మా చిరునామా :**
ఎడిటర్, పరిశుద్ధత
పోస్ట్‌బాక్స్ నెం. 28
ఒంగోలు - 523001
ఫోన్ : 08592-231281
సెల్ : 9704255416

## లోపలి పేజీల్లో...

| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| అపొస్తలుడు | కొడవటికంటి | 03 |
| లియో టాల్‌స్టాయ్ | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 06 |
| కనిపించేవన్నీ మనం.... | మామయ్య కథలు | 09 |
| | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | |
| బైబిలు చరిత్ర | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 11 |
| మధ్యకాలము | బ్రదర్ కె. సామ్రాట్‌గారు | 14 |
| ఎంతైనా నమ్మదగిన దేవుడు | సాక్ష్యము | 16 |
| మర్మములు | రెవ. డా॥ కొడవటికంటి విక్రాంత్ | 17 |
| దర్శనములు | శ్రీమతి రిబ్కా విక్రాంత్ | 19 |
| సాక్ష్యము | బొల్లెద్దు జాన్, పెనుమూడి | 21 |
| అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ | | 24 |
| | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | |

India Evangelistic & Relief Fellowship

| **EVANGELISM** | **RELIEF** |
|---|---|
| Church Planting | Orphanage |
| Evangelestic, Crusades | Child Development Centers |
| Pastor's Seminars | Education (U.C.L.I. Schools) |
| Youth Ministry | Widows & Leprosy Care |
| T.V.Ministry | Medical Assistance |
| Magazine Ministry | Help in Natural Calamity |
| Audio Ministry | Flood Relief |
| Jail & Prison Ministry | Mobile Medical Ministry |
| IERF International | Children Care Ministry |
| Hanna Women Ministries | |

**ప్రకటన రేట్లు**

| | | |
|---|---|---|
| టైటిల్ 4వ పేజీ | ..... | రూ. 3,000/- |
| టైటిల్ 3వ పేజీ | ..... | రూ. 2,000/- |
| లోపలి పేజీ | ..... | రూ. 1,000/- |

# సంపాదకీయం.....



ప్రభువునందు ప్రియ పరిశుద్ధత పాఠకులకు యేసు నామములో వందనములు.

పరిశుద్ధత పత్రికకు మీరు పంపుతున్న అభినందలకు కృతజ్ఞతలు. ఈసారి పత్రికలో "సజీవ సాక్ష్యములు" అనే శీర్షికను క్రమముగా ప్రచురిస్తాము. మీరు కూడా మీ సాక్ష్యములను పంపిస్తే తప్పక ప్రచురించగలము.

ఈ నెల పత్రికలో ముందు చెప్పిన విధముగా "ఇలా అయితే బాగుండును" అనే శీర్షికను స్థల భావనము వలన ప్రచురించ లేకపోతున్నందుకు విచారిస్తున్నాము.

ఇంకా చాలా మంది 100 రూపాయలే పంపుచున్నారు. సంవత్సర చందా 150 రూపాయలు పంపించవలసినదిగా మనవి. ప్రపంచ పరిస్థితి దారుణంగా ఉన్నదని మనకందరికి తెలుసు. మన రాష్ట్ర పరిస్థితి కూడా చాలా దమనీయంగా ఉన్నది. మనకు రావలసిన "ప్రత్యేక హోదా" ఏ స్థితిలో ఉన్నదో ఎవరికి తెలియదు. రాజకీయ నాయకులకు మాటలు దాటేయటం పరిపాటే. మన గోడు పట్టించుకునే నాధుడు లేడు. ప్రత్యేక హోదా రాకపోతే మన ఆంధ్రప్రదేశ్ పరిస్థితి గడ్డుగా మారిపోతుందని మన అందరికి తెలుసు.

మన విద్యా వ్యవస్థ, వర్తకము, ఆర్థిక పరిస్థితి చాలా పడిపోతుంది. నిరుద్యోగము పెరిగిపోతుంది. ఈ సంగతి మన నాయకులకు తెలుసు. అయినా పట్టించుకోరు ఎందుకంటే వాళ్ళ పరిస్థితి మెరుగుగానే ఉంటుంది.

అయితే మనకు సహాయకుడు ఒకడు ఉన్నాడు. ఆయనే "యేసు". నమ్ముట నీవలననయితే నమ్మువానికి సమస్తము సాధ్యమే. నీవు నీ కుటుంబము అత్యాసక్తితో ప్రార్థించితే మన దేశమును బాగు చేయగలడు.

"వారి దేశమును స్వస్థపరిచెదను" అని సెలవిచ్చాడు.

"నమ్ము దేవుని మహిమ చూచెదవు".

నోవహు కుటుంబ ప్రార్ధన ప్రపంచమును రక్షించిదను సంగతి జ్ఞాపకము చేసికొనండి.

ప్రార్థించండి దేవుడు మిమ్మును దీవించును గాక.

-ఎడిటర్

# అపొస్తలుడు



**– కొడవటికంటి**

ఇప్పటికి సగం దూరం కూడ ప్రయాణం పూర్తికాలేదు. తర్వాత మజలీ 'మగ్దలా' పట్టణము. ఇది పూర్తిగా ప్రక్కనున్న తిబెరియా పట్టణం వాతావరణలో బంధింపబడింది. ఇది లెక్కకు ఇశ్రాయేలు దేశంలో ఉండి, రోమీయుల ఆచార వ్యవహారాలలో మునిగి ఉంది.

"తిబెరియ పట్టణం 'అంతిప హేరోదు' గలలియ పరిపాలించే పట్టణం ఇదే! అయితే నజరేయుడు ఒక్కసారి కూడ ఈ పట్టణంలో ప్రవేశించలేదు" అన్నాడు రీఫత్.

"ఎందువలన?" అడిగాడు సౌలు.

"ఏమో! హేరోద్దైతే యేసును చూడాలని అనుకునే వాడట. కాని, యేసు ఈ లోకములో బ్రతికిన ఆఖరి రోజు మాత్రమే యెరూషలేములో యేసును అతడు చూడగలిగాడు" అని చెప్పాడు రీఫత్.

సౌలు ఆ పట్టణంలో ప్రవేశించకుండానే ఎలాగైనా రాత్రికి మగ్దలా పట్టణంలో గడపాలి అనుకున్నాడు. అది గలలియ సముద్రపు ఒడ్డున ఉన్నందున అక్కడ వాతావరణం బాగుంటుంది అనుకున్నాడు.

రాత్రి చాలా ప్రొద్దుపోయిన తర్వాత మగ్దల చేరుకున్నాడు. మగ్దలా పట్టణంలో సమాజ మందిరంలేదు. అందువలన సౌలుకు స్వాగతం చెప్పటానికి ఎవరు రాలేదు.

ఎవరు రాకపోవటం ఎంతో ఆనందం కలిగించింది. అంతకు ముందు నిశబ్దంగా ఉన్న ఈ జీవితం, దేవుని కోసమై ఈ దేవదూషకుల ఏరివేత కార్యక్రమాల్లో చిన్నాభిన్నం అయింది. రీఫత్ యొక్క సహచర్యము. చాలా నెమ్మది కలిగించింది. తనతో వచ్చే బంట్రౌతుల మంచి చెడ్డా అంతా రీఫత్ చూసుకొంటున్నాడు. సూర్యోదయం కాకముందే గలలియ సరస్సు ఒడ్డున చేపలు వేటకి పోయిన జాలరులు మగ్దలా ఒడ్డుకు చేరు కొంటున్నారు. ఏ ప్రాంతమువారు ఆ ప్రాంతము చేరుకొంటున్నారు.

సౌలు కూర్చుని ఉన్న మండపం అంటే 'అంతిపా హేరోదు' యొక్క విలాసమందిరం. ఇప్పుడు హేరోదు అంతిపా ఈ మందిరాన్ని వాడటం లేదు. అందువలన దీని ఆలనాపాలనా చూసేవారు లేరు. ఇప్పుడు హేరోదు తన విలాస జీవితానికి, రహస్య సమావేశమునకు మృత సముద్రపు తూర్పు ఒడ్డున ఉన్న 'మచారియా' మందిరం వాడుకొంటున్నాడు. ఆ మందిరంలోనే తన పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవటానికి వెళ్ళి యోహాను గారి తల తీయించారు.

సూర్యుడు కొంచెం పైకి లేచిన తర్వాత రీఫత్ వచ్చి కలిసాడు. వస్తూనే "ఈ సరస్సులోనే నీళ్ళమీద ఆయన నడుస్తూ శిష్యుల దగ్గరికి వచ్చాడు" అన్నాడు.

సౌలు వెంటనే "నీకెలా తెలుసు?" అని అడిగాడు.

"ఆయన శిష్యులు చెప్పారు" అన్నాడు.

" నువ్వు ఆయన దగ్గర ఎంతకాలం శిష్యుడుగా ఉన్నావు?" అన్నాడు సౌలు.

రీఫత్ కొంచెం ఆలోచిస్తు వ్రేళ్ళు లెక్కపెడుతు "సుమారు ఆరు నెలలు. నేనే కాదు, నాతో చాలమంది, అంటే కొన్ని వందలమంది ఆ రోజునుండి ఆయన శిష్యులుగా ఉండటం మానుకొన్నాము" అన్నాడు.

"ఆ రోజు అంటే?" రెట్టించాడు సౌలు.

"పస్కాపండుగకు ముందు – ఆయన ప్రజలకి పరిచయమయి రెండేళ్ళు పూర్తి అయిన తర్వాత, ప్రవక్తయైన యోహాను హత్య చేయబడిన, తర్వాత" అని తన కుడి చేతిని ఎడమ ప్రక్కగా చూపిస్తూ సరస్సు నీళ్ళలోకి ఒక అడుగువేసి "ఆ కొండలలో ఒకదాని మీద అయిదు రొట్టెలతో పదివేల మందికి ఆహారం పెట్టాడు. అందరు తృప్తిగా తినిన తర్వాత మిగిలిన ముక్కలను ఆయన పోగుచేయమన్నాడు. అలాగ మేమంతా ఏరి శిష్యుల కిచ్చాము. అప్పుడు పన్నెండు మంది ముఖ్య శిష్యుల చేతులలోని గంపలు నిండినవి" అన్నాడు రీఫత్.

ఆ రొట్టెలు ఆయన విరుస్తుంటే పెద్దవి అయినవా! లేక గంపలో వేసినప్పుడు అవి గంపను నింపుతున్నవా?" అని సౌలు అడిగాడు కొంచెం ఆసక్తిగా...

"అది నాకు తెలియదు కాని, ముఖ్య శిష్యులు పన్నెండుగురు యేసు యొద్దనుండి గంపలనిండా రొట్టెలు తీసుకొని మాకు ఇస్తుంటే మేము కూర్చున్న వారందరికి వడ్డించాము" అన్నాడు.

"ఆ సాయంకాలం మేమందరము ఆయనను రాజును చెయ్యాలని అనుకున్నాము. కాని ఆయన – తన శిష్యులను, బలవంతంగా బెత్సయిదా పంపించివేసి తను ఒక కొండ ఎక్కివెళ్ళాడు. తెల్లవారుజామున మేమందరం ఆయన కోసం అంతటా వెదికాము. చివరకు కపెర్నహూములో ఆయనను పట్టుకున్నాము. ఆయన అప్పుడు మాట్లాడిన దానిని బట్టి నాతోపాటు చాలామంది ఆయనను వెంబడించటం మాని వేసాము. ఆయనను వెంబడిస్తే కాళ్ళ నొప్పులు, ప్రధాన యాజకుల దగ్గర మాటలు పడవలసి వస్తుంది" అన్నాడు రీఫత్.

సౌలు తనకు ఎడమ ప్రక్కన ఉన్న కొండల సముదాయమును చూస్తూ రీఫత్‌తో, "ఆయన మాట్లాడిన మాటలు ఏమిటి?" అన్నాడు.

"నా శరీరమును తిని, నా రక్తము త్రాగుము – వాడే నిత్యజీవము గలవాడు, నా శరీరము నిజమైన ఆహారమును, నా రక్తము నిజమైన పానమునై యున్నది" అన్నాడు.

మీరు చెప్పండి? ఇంత కఠినమైన మాట ఎవరు వినగలదు? అప్పటినుండి మాలో, అంటే ఆయన శిష్యులలో అనేకులము వెనుక తీసి మరి ఎన్నడును ఆయనను వెంబడించలేదు. కాని కొంతమంది అలా వెనుక తీసినవారు ఆయన సిలువ మరణము పొందిన తరువాత ఆయన మెస్సయ్య అని, దేవుని కుమారుడని చెప్పటం మొదలు పెట్టారు" అన్నాడు.

సౌలు ఆలోచిస్తూ ఆ కొండ వైపు చూస్తూ ఉన్నాడు. "నిజంగా ఈ నజరేయుడు పిచ్చివాడు కాదు. మొత్తానికి ఏదో శక్తి గలవాడు. ఈ మాటలకి ఏదో అర్థం ఉండి ఉంటుంది" అనుకుంటు,

"ఈ మాటలు ఎక్కడ ఉన్నప్పుడు అన్నాడు?" అని అడిగాడు.

"కపెర్నహూములోని సమాజమందిరంలో అన్నాడు. అంతే కాదు – మీ పితరులు అరణ్యంలో 'మన్నాను' తినినను చనిపోయిరి. దీనిని తినువాడు చావకుండునట్లు పరలోకము నుండి దిగివచ్చిన ఆహారమిదే అన్నాడు" అని చెప్పాడు.

"అప్పుడు పెద్దలు ఏమి అన్నారు?" అని అడిగాడు సౌలు.

"యెరూషలేము వారు వాడు దయ్యము పట్టినవాడు, వెర్రివాడు, వానిమాట ఎందుకు వింటారు? అన్నారు. యూదులు నీవు సమరయడవు, దయ్యము పట్టినవాడవు అన్నారు.

అంత ఎందుకు? కపెర్నహూములో ఆయన ఇంట్లోకి వెళితే ఆయన తల్లి, సహోదరులు, ఆయనకు మతి చలించి ఉన్నదని చెప్పి పట్టుకొనబోయారు.

"అప్పుడు నజరేయునికి కోపం రాలేదా?" అడిగాడు సౌలు.

"ఆయన కోపపడింది యాజకుల మీద, పరిసయ్యులమీద, శాస్త్రులమీద. అప్పుడప్పుడు తన శిష్యుల అవిశ్వాసము చూచి బాధపడేవాడు కాని – పాపాత్ములను, సుంకరులను, వేశ్యలను ప్రేమగా గౌరవముగా చూసేవాడు" అలా రీఫత్ మాట్లాడుతూ ఉంటే సౌలు – రెండు చేతులతో తన కణతలను వత్తుకుంటు మోకాళ్ళ మధ్య తలను పెట్టుకున్నాడు.

రీఫత్ వెంటనే అక్కడనుండి వెళ్ళి పది నిమిషాలలో ద్రాక్షా రసం తిత్తి చిన్నది తీసుకొని వచ్చి కొంచెం పోసి ఇచ్చాడు.

అది సౌలు తీసుకొని ఒక గ్రుక్కలో త్రాగి సేద తీరునట్లుగా స్థంభానికి జారగిల పడ్డాడు.

రీఫత్ కొంచెం ప్రక్కగా ఆనుకొని కూర్చున్నాడు. "ఈ ప్రయాణంలో ఇదేకదు మొదటిది?" అన్నాడు. "ఇక్కడ రెండు రోజులు విశ్రాంతి తీసుకుందామా? లేక 10 మైళ్ళ దూరంలో ఉన్న కపెర్నహూము వెళదామా? అక్కడ మంచి వసతులు ఉంటాయి. చాలామంది వైద్యులు ఉన్నారు" అన్నాడు.

సౌలు తల అడ్డంగా, నిరాశగా తిప్పుతు "ఎక్కడకెళ్ళినా అంతే! ఇంతకుముందు ఎంతమంది వైద్యులను చూడలేదు? అయితే ఈ మధ్య కొంతకాలం కనబడలేదు – ఈ తలనొప్పి. కంటి చూపువలన వచ్చింది. కనుక కంటికి విశ్రాంతి ఇస్తే తగ్గిపోతుంది. ఇప్పుడు ఈ ద్రాక్షారసం తీసుకొన్న తర్వాత కొంచెం ఉపశాంతిగా ఉంది" అన్నాడు. "దీనికి శాశ్వత నివారణ లేదు" అన్నాడు మళ్ళీ నిరాశగా.

తలవాల్చు కొన్నప్పుడు – ఆ బాధలో పెద్దగా అరవాలని పించింది. రీఫత్ తలను పట్టుకొంటే – సైఫను గుర్తుకు వచ్చాడు. చిరాకు వేసింది. సైఫన్ ఎందుకు మాటిమాటికి స్మరణకు వస్తున్నాడు?

మరణం న్యాయసమ్మతమైనది కాదు. నిజమే! కాని ఇందులో తన బాధ్యత ఏమి వుంది? అయినా తనే దీనంతటికి కారణమైనట్లుగా ఎందుకు ఈ వేదన? అనుకొన్నాడు ఇంక ఎంతకాలానికి సైఫను మరణం, అతని మాటలు తన మస్తిష్కం నుండి బయటకు వెళ్ళిపోతాయి? దేవా! ఏమిటి నీ సేవలో ఈ క్షోభ? అనుకున్నాడు.

ఒక గంట తర్వాత ఇద్దరు కలసి, నిదానంగా తమ బసకు నడుస్తు వెళ్ళారు. తర్వాత భోజనానికి కూర్చున్నప్పుడు ఎదురుగా సరస్సుకు ఉత్తరంగా ఆకాసంన్నంటే కట్టడాలు, అందమైన కపెర్నహోము, ఆకాశమంత ఎత్తుకు ఎదిగి కనబడుతుంది. అదే ఆ నజరేయుడి స్వదేశమయింది.

సౌలు ఆలోచన చదివినట్లుగా రీఫత్ సౌలును చూసి "మీరు చూస్తున్న ఆ కపెర్నహోమును చూసి ఒక రోజున ఆయన–యేసు ఏమన్నాడో తెలుసా?" అని కొంచెం ఆగి,

"కపెర్నహోమా! ఆకాశము మటుకు హెచ్చింపబడెదవా? నీవు పాతాళము మట్టుకు దిగిపోయెదవు. నీలో చేయబడిన అద్భుతములు సొదమలో చేయబడిన యెడల నేటివరకు నిలిచియుండును అన్నాడు ఆవేశంగా...." అని చెప్పాడు.

సౌలు నిశబ్దంగా ఆకాశంవైపు చూస్తూ ఉండిపోయాడు.

మరుసటిరోజు ప్రయాణం. కొంచెం ప్రొద్దెక్కిన తర్వాత బయలుదేరి గన్నేసరెతు గ్రామములో ఆగిపోయారు. కండ్ల వెంబడి నీళ్ళు కారుతున్నట్లుగా మొదలైన తలనొప్పి, తర్వాత విపరీతమైన వణుకుతో మొదలైన శరీర రుగ్మత. అది వదలిపోయినా మూడు, నాలుగు రోజులదాక లేచి నడవాలని అనిపించదు. తనలోని శక్తినంతా ఎవరో ఉతికిన గుడ్డను పిండినట్లుగా తన శరీరమంతా అన్యాక్రాంతము అయిపోయింది.

తర్వాత ప్రయాణం – దమస్కుదాక. గలలియ దాటిన తర్వాత దమస్కు వరకు ప్రయాణం బహుకష్టమైనది. అంతా కొండలు. ఎడమ వైపున ఉత్తరంగా హెర్మోను కొండ. పై భాగమంతా మంచుతో కప్పబడి ఉంటుంది. హెర్మోను పొడవు 20 మైళ్ళు, ఎత్తు 9 వేల అడుగులు. మూడు శిఖరములు కలిగినది. పురాతన కాలములో దీనిని సియోనుకొండ అనేవారు. కొండలు దాటి కెపెర్నహూముకు దూరంగా 16 మైళ్ళు వెళ్ళిన తర్వాత 'జిసర్ బొసట్ యూకూబ్' రాతి వంతెన దాటుతున్నప్పుడు రీఫత్ మొదలు పెట్టాడు.

"ఈ వాగును 'యాకోబు కుమార్తెల వాగు' అని ఎప్పుడు పేరు పెట్టారో మనకు తెలియదు కాని, ఇక్కడి నీరు అతి చల్లగా, నీలిరంగులో ఉంటాయి. ఈ పద్దెనిమిది అడుగుల వంతెన ఎన్నివందల ఏండ్లనుండి మనుష్యులను గిలాదు దేశానికి చేరవేస్తుందో!?" అన్నాడు.

హెర్మోను కొండమీద మంచు కరిగి అతివేగంగా ఈ వాగులో చేరి – గలలియ వైపు అతి దూకుడుగా ప్రయాణం చేస్తుంది. మూడు వాగులు కలసి యోర్దాను నదిగా ఏర్పడతాయి. గిలాదు కొండల వరుసలో చివరి ఒంటెమీద నుండి వెనక్కి తిరిగి చూస్తే గలలియ సముద్రం అతి సుందరంగా కనబడుతుంది. సరస్సుకు దక్షిణంగా యోర్దాను మొదలు – కువ్వెన ఆకారంలో కనబడుతుంది.

దమస్కు పట్టణం సమీపించే కొలది తను బయలుదేరిన కారణం, ప్రధానయాజకుల కోరిక, దేవుని నామ ఘనతకైన తన ప్రయాస, దేవదూషకులైన నజరేయుని శిష్యుల ఏరివేత, ఈ పదిరోజుల ప్రయాణం, బడలిక ముగింపు, రీఫత్ యొక్క వివరణలతో సాగింది.

దశాబ్దముల మొదలులో ఈ దమస్కు పట్టణం ఇశ్రాయేలు జీవితంలో ముఖ్యపాత్ర వహించింది. సిరియనుల విగ్రహా రాధన ఇశ్రాయేలు దేశాన్ని ముంచి వేసింది.

ఇప్పుడు నజరేయుని శిష్యులు దానిని జయించి పరిపా లించుచున్నట్లుగా అనిపించింది. ఈ యేసు బోధకు ఇప్పుడు తాను ఆనకట్ట వేయబోతున్నాడు. ఇంతవరకు యెరూషలేములో కాని మరే పట్టణంలో కాని, వారి వలన తనకు ప్రతిఘటన రాలేదు. అలాగని ఇప్పుడు దమస్కులో ప్రతిఘటన రాదని ఎవరు చెప్పగలరు?

**(సశేషం)**

సీరియల్

# ఒక మనిషికి ఎంత నేల కావలెను? 18

## (లియో టాల్‌స్టాయ్)

నడుస్తూనే ఆహారం తీసుకుంటూ మధ్యాహ్నం పన్నెండు గంటలకు తూర్పుదిశ నుండి దక్షిణవైపుగా తిరుగుతూ ఓ గొయ్యి తవ్వి పెద్ద కర్ర పాతిపెట్టాడు. ఇప్పటికి పదిహేను కర్రలు చిన్నవి నిలబెట్టాడు. అలా దక్షిణం వైపున తిరిగి మరలా కొన్ని కర్రలు నాటుకొని నడుస్తున్నాడు. రాత్రి నిద్రలేనందున కండ్లు ఎర్రగా ఉబ్బాయి. సూర్యుడు తీక్షణ మైన వేడిని కురిపిస్తున్నాడు. ప్రయాణం ప్రారంభములో ఉన్నంత సాఫీగా పొలంలేదు. గుంటలు గుంటలుగా ఉన్నది. ఇప్పుడు ఎడమప్రక్కగా తిరిగితే అంటే పడమటి వైపుగా తిరిగితే తను వచ్చిన చోటికి సూర్యుడు క్రుంగక ముందే చేరుకోవచ్చు. ఒళ్ళంతా చెమట. కోటు తీసి ప్రక్కన పడేసి నడకను కొంచెం వేగం పెంచాడు. ఇప్పటికి ముప్పయి మైళ్ళు నడిచి ఉండవచ్చును. ఎన్ని ఎకరాలు? అదంతా ముందు కొండకు చేరిన తర్వాత చూచుకుందాము అనుకున్నాడు. కాళ్ళు బరువెక్కాయి. బూట్లు విప్పదీసి దూరంగా కొండవైపు చూచాడు. కొండ కనబడలేదు. నడక వేగం చేశాడు. సూర్యుడు తన నడకను వేగం చేశాడా? అనుకున్నాడు. మధ్యమధ్యలో కర్రలు నాటుతూ ఉన్నాడు.

దూరంలో కొండ కనిపించింది. ఇప్పుడు ఇక గడ్డ పారతో పనిలేదు అనుకున్నాడు. దాన్ని అక్కడ వదిలాడు. నోటిలోకి నీరు వచ్చినట్లుగా ఉంది. ఉమ్మి ఊస్తే నెత్తురు వచ్చింది. దూరంలో కొండమీద జనం-చిన్న గొఱ్ఱెల వలె కనిపించారు. ఇంకొంచెంసేపటికి వారు అరుస్తూ చేతులు ఊపుతున్నారు. కాని తాను నడవలేక తూలి పోయాడు. సూర్యుడు కొండ వెనుకకు వెళ్తున్నాడు. శక్తినంతా సమ కూర్చుకొని లేచి నిలుచుని నడక ప్రారంభించాడు. ఇప్పుడు భాష్కిర్ జనం అంతా సంతోషంతో అరుస్తున్నారు.

తను వేసుకున్న ప్యాంటు క్రిందిభాగము చినిగి పోయింది. దాన్నిలాగి డ్రాయరుమీద రెండు అడుగులు వేశాడు. మరలా కూలిపోయాడు. ఇంకా ఆరడుగులు నడిస్తే ఇందాక నాయకుని దగ్గర నుండి బయలుదేరేటప్పుడు నాటిన కర్ర చేరుకోవచ్చు. ఎంత ప్రయత్నించినా ఒక్కడుగు కూడా తను ముందుకు సాగలేదు. ఉదయం కనిపించిన సాతానుడు తన ఎదురుగా కుర్చీలో - ఉదయం కలలో కూర్చున్న రీతిలో కనిపించాడు. వెల్లకిలా తిరిగి సాతాను మొహం చూశాడు. సాతాను నవ్వుతున్నాడు.

"ఇప్పుడు నీకు కావలసినది ఆరడుగుల భూమి మాత్రమే!" అన్న మాటలు వినిపించాయి.

ఎవరో వచ్చారు. నోట్లోనుండి వస్తున్న రక్తాన్ని తుడిచి "చనిపోయాడు!" అని అంటున్నాడు.

**"అతను పడిపోయిన స్థలములోనే, ఇంకా అతను నడువవలసిన ఆరడుగుల స్థలములోనే అతనిని పాతిపెట్టండి" అంటున్న నాయకుని స్వరము వినిపించింది.**

## అపరాధియైనవారు ఎవరూ లేరు

**మాస్కో నగరంలో ఓ బ్యాంక్‌లో పనిచేస్తున్న** - వోల్గిన్ - బ్రహ్మచారి. అతనికి నెలకు యాభైవేల రూపాయలు జీతము. అతని వయస్సు యాభై సంవత్సరాలు.

ఇరవై అయిదు వందల ఎకరాల మాగాణి పొలం కలిగిన ఓ భూస్వామి ఇంటిలో డబ్బు చెల్లించే అతిథిగా ఉంటున్నాడు.

సాయంకాలం బ్యాంక్ నుండి ఇంటికి వచ్చిన వోల్గిన్

తన వలెనే ధనవంతులై – అదే ఇంటిలో డబ్బు చెల్లించే అతిథులతో కలిసి రెండు మూడు రకాల పేకాట ఆడి అలసిపోయి తన గదిలోకి వచ్చాడు. రాగానే చేతికి ఉన్న బంగారు గొలుసు, జోబి గడియారము, వెండి సిగిరెట్ పెట్టె, పాకెట్ నోట్‌బుక్, పెద్ద మనీపర్సు, గడ్డం దువ్వు కోవడానికి ఒక బ్రష్, తల దువ్వుకోవడానికి దువ్వెన, ప్యాంట్ జేబులో నుండి తీసి అల్మారాలో పెట్టాడు. పెద్ద కోటు వంకీకి తగిలించి, నైటు గౌను వేసుకొని తీరికగా మంచం మీద పండుకొని ఈ పగలంతా జరిగిన సంగతులు ఆలోచించసాగాడు. సిగిరెట్టు పూర్తయిన తరువాత దానిని యాష్‌ట్రేలో పడేసి చేతిప్రక్కన ఉన్న స్విచ్‌తో లైటు ఆర్పి అటు తిరిగి నిద్ర పోయాడు. అప్పుడు రాత్రి ఒంటిగంట అయింది. ఆ రోజు ఎక్కువగా అలసి పోయినందున మంచి నిద్రపట్టింది.

ఉదయం మెళకువ రాగానే స్లిప్పర్సు వేసుకొని బాత్ రూంలోకి వెళ్ళివచ్చి కాలింగ్‌బెల్ వత్తాడు. అతను ఓ ఇంటికి యజమాని. ఆరుగురు మనుమలు కలిగి గత ముప్పై సంవత్సరాలుగా ఈ ఇంటిలో వంటవానిగా పనిచేస్తున్న వృద్ధుడైన స్తెఫన్. ఆ బెల్ శబ్దానికి రాత్రి వోల్గిన్ విప్పిన బూట్లను పాలిష్ చేసినవి తీసుకొని గదిలోపెట్టి చక్కగా ఇస్త్రీ చేసిన కోటు ప్యాంట్ తెచ్చాడు. వోల్గిన్ ఆ వంటవానికి థ్యాంక్స్ అని చెప్పి బయట వాతావరణం ఎలావుందో అని గోడ గడియారం వైపు చూచి చాలా సమయమున్నది అనుకున్నాడు. స్నానాలగదిలో వేడినీరు సిద్ధముగా ఉన్నది. బ్రష్‌తో పళ్ళు తోముకుంటూ బాత్‌రూంలో అద్దం ముందు నిలుచుని బేటరీతో నడిచే మిషన్‌తో గడ్డం ప్రక్కల గీచుకొని స్నానము చేసి వచ్చేటప్పటికి స్తెఫను డ్రస్సింగ్ టేబుల్‌ను శుభ్రంగా ఉంచాడు. ఆ డ్రస్సింగ్ టేబుల్ వద్ద అరగంట అన్నిపనులు ముగించి గడ్డం మధ్యగా చీల్చి దువ్వాడు. స్ప్రే శరీరమంతా చిమ్మాడు. బూట్లు వేసుకొని సిద్ధపడి అద్దంముందు నిలుచుని అన్నీ చక్కగా అమరినవి అనుకొంటూ గదిలోనుండి బయటకు వచ్చాడు. అక్కడవున్న రింగ్ కుర్చీలో కూర్చుని సిగిరెట్టు ముట్టించి 'ఈ రోజు వాకింగ్‌కి ఎటు వెళ్ళాలి?' అని ఆలోచించాడు. వంగిపోయిన నడుముతో స్తెఫను తన గదిని శుభ్రము చేయడం చూసి – టిఫిన్ చెయ్యడానికి డైనింగ్ రూం వైపుగా వెళ్ళాడు.

ఆ బంగళాలో నివశించే ఎనిమిదిమందికి వంట చేసి వడ్డించడానికి పదిమంది పనివారు ఉన్నారు. వీరంతా ఉదయాన్నే తెల్లవారకముందే వచ్చి వంట ప్రారంభిస్తారు. పెద్దగది మధ్యలో చాలా ఖరీదైన బల్లమీద తెల్లని గుడ్డపరచి బల్లచుట్టూరా వేయబడిన పది కుర్చీలకు ఎదురుగా చక్కని అల్లికగల వాష్‌పేపర్లు పరిచివున్నాయి. అవి చూడడానికి వెండితో చేయబడినవిగా కనిపిస్తాయి. కాఫీ ఒక పొడవైన నగిషి పాత్రలో ఉన్నది. వేడిపాలు చిన్నపాత్రలో ఉన్నవి. రొట్టె ప్రక్కనే వెన్న, జామ్ సీసాలు ఉన్నాయి. ఒక పాత్రలో రకరకాల క్రీమ్ బిస్కెట్లు ఉన్నవి. ఇంటి యజమాని రెండవ కుమారుడు మాత్రమే ఒక కుర్చీలో కూర్చుని ఉన్నాడు. అతని ప్రైవేటు మాస్టారు కూడా ఉన్నాడు.

వోల్గిన్ టిఫిన్ పూర్తిచేసి, కాఫీ త్రాగుతూ ప్రైవేటు మాస్టారుతోను, ఇంటి సెక్రెటరీతోను కొంచెంసేపు మాట్లాడాడు.

ఇంటి యజమాని పెద్దకుమారుడు త్రీడోర్ – రాత్రి భోజనము చేసేటప్పుడు తన తండ్రితో అనవసరంగా తగాదా పెట్టుకున్నాడు. యూనివర్సిటీలో చదువుతూ రెండవ సంవత్సరం చదువకుండా ఇంటికివచ్చి హోమ్‌గార్డుగా చేరాడు. ఆరునెలలకి అది మానేసి ఇంటివద్దనే ఊరకనే కూర్చుని అందరిమీద తప్పులుపెడుతూ ఎప్పుడూ చిర్రుబుర్రులాడు తుంటాడు. అతని భార్య, అతను ఇంకా నిద్రపోతూనే ఉన్నారు. త్రీడోర్ భార్యకు ఒక వితంతు చెల్లెలు ఉన్నది. ఆమెకూడా ఈ ఇంటిలోనే నివశిస్తున్నది.

టిఫిన్ అయిన తర్వాత వోల్గిన్ స్టాండుకు తగిలించిన రెండువేల రూపాయలు పెట్టి కొన్న టోపీని తలమీద పెట్టుకొని, దంతము పొదిగిన చేతికర్రను తీసుకొని బయటకు వచ్చాడు. వరండాలో ఉన్న కుర్చీలో కూర్చుని దినపత్రిక తీసి చదవడం ప్రారంభించాడు. హెడ్డింగులు మాత్రం – దోపిడీలు, అత్యాచారాలు చదివి రాజకీయ నాయకుల కదలికలకు సంబంధించిన వార్తలు చదివి విసుకుగా పత్రికను ప్రక్కన

పెట్టి లేచాడు. ఎదురుగా ఉన్న పూలతోటలో అయిదు రంగులలో పూలచెట్లు ఉన్నాయి. వాటి దగ్గర తోటమాలి ఏదో పనిచేస్తున్నాడు. అల్లంత దూరంలో ఓ పనికత్తె నేలలో నుండి ఉర్లగడ్డలను త్రవ్వి తీస్తున్నది. చాలా ఖరీదైన బుట్టలో త్రవ్విన ఉర్లగడ్డలను తీసుకొని లోపలకు వెళ్తున్నది. ప్రక్కనే వరుసగా ఎదిగిన వంద సంవత్సరాల వయస్సున్న నిమ్మచెట్లకు పనిపిల్లలు ఎరువువేస్తూ వాటికి మందులు చల్లుతున్నారు. ఒక యవ్వనస్తుడు ఓ అట్టపెట్టెను తలమీద పెట్టుకొని ఇంటి ముందు నిలచివున్న గుఱ్ఱపుబగ్గీలో పెడుతున్నాడు.

అక్కడనుండి నూట పాతిక ఎకరాల విస్తీర్ణములో ఉన్న పార్కులోకి ప్రవేశించాడు. చుట్టూ ప్రహరీగోడ కట్టబడి ఉన్నది. సిగిరెట్టు త్రాగుతూ అలవాటైన ఆ మార్గములో నడుస్తుంటే ఎంతో ఉల్లాసము కలిగింది. పొలాలలో అయితే ఇంకా ఆహ్లాదకరంగా ఉంటుంది అనుకున్నాడు. ఎడమ ప్రక్కగా పాడిపశువులు పచ్చికబయలులో మేత మేస్తున్నాయి.

తను చేస్తున్న ఉద్యోగము వలన ఈ గొప్ప ఇంటిలో డబ్బిచ్చి అయినా సంతోషంగా జీవిస్తున్నాను అని గట్టిగా గాలిపీల్చి వదిలాడు. అదృష్టవంతులు మాత్రమే పల్లెటూర్లలో సంతోషంగా జీవించగలరు అనుకున్నాడు. అయితే జీనోల్డు నూట యాభై ఎకరాల పొలం, యాభైమంది పనివారితో ఎప్పుడు టెన్షన్‌తో జీవిస్తాడు కదా! అనుకున్నాడు. వోల్గిన్ తల ఆడించాడు. మరొక సిగిరెట్ ముట్టించాడు. ఇంగ్లీషు బూట్లలో ఉన్న తన బలమైన పాదాలతో గట్టుమీద ఠీవీగా నడుస్తూ తను బ్యాంక్‌లో చేయవలసిన ఉద్యోగ కార్యక్రమాల గురించి ఆలోచించసాగాడు. ప్రతిరోజు ఉదయం పదిగంటల నుండి రెండుగంటల వరకు పని చెయ్యాలి. ఒక్కోసారి సాయంకాలం అయిదు గంటలవరకు ఉండాలి. అవికాక బోర్డు మీటింగులు, కొందరు ఖాతాదారులను ప్రత్యేకంగా సంప్రదించాలి. ఇంకా బ్యాంక్‌లో ఉండే కొందరు స్నేహితులతో సంభాషణ.

పార్కులోనుండి బయటకు వస్తే అక్కడ గొఱ్ఱెల మంద, కొన్ని పందులు, ఆవుదూడలు – పల్లెకు సంబంధించినవి మేత మేస్తున్నాయి. వాటి దగ్గరగా వెళ్తే అవన్ని చెల్లాచెదరు అవుతాయని ఆగిపోయాడు.

యూరప్‌దేశానికి, మనదేశానికి ఎంత వ్యత్యాసమున్నది? అనుకున్నాడు. తను తరచు యూరప్ వెళ్ళినపుడు కలిగిన అనుభవాలను తలచుకుంటూ 'అక్కడ ఇలా పశువులు బయట ఎక్కడ కనిపించవు' అనుకున్నాడు.

అక్కడ పశువులకాపరి – ఓ కుర్రాడు కర్ర చేతితో పట్టుకొని నిలుచున్నాడు. అతనిని చూస్తూ "మంద ఎవరిది?" అన్నాడు.

ఆ అబ్బాయి భయపడినట్లు కనిపించాడు. వోల్గిన్ తలమీద ఉన్న మెరుస్తున్న టోపీని చూస్తున్నాడు. వెంటనే జవాబు చెప్పలేకపోయాడు.

"ఈ మంద ఎవరిది?" అని మరలా అడిగాడు.

"మనదే" అన్నాడు ఆ అబ్బాయి.

"మనదే – ఎవరిది?" అన్నాడు వోల్గిన్ నవ్వుతూ.

ఆ అబ్బాయి చినిగిపోయిన బూట్లు త్రాళ్ళతో కట్టుకున్నాడు. ఓ కోను ఆకారం టోపీ తలమీద పెట్టుకొని, చాలా మాసిపోయిన పెద్ద చొక్కా ధరించి ఉన్నాడు.

"మనదే అంటే ఏమిటి?" అన్నాడు వోల్గిన్.

"పిరోగోవ్ గ్రామానికి చెందినవి" అన్నాడు అబ్బాయి.

"నీకెన్నేళ్ళు?" అన్నాడు వోల్గిన్.

"నాకు తెలియదు" అన్నాడు అబ్బాయి.

"నీవు చదువగలవా?" అన్నాడు వోల్గిన్.

"నాకు రాదు" అన్నాడు.

"నీవు బడికి వెళ్తున్నావా?" అని అడిగాడు.

"వెళ్తున్నాను" అన్నాడు అబ్బాయి.

"ఈ దారి ఎటువెళ్తుంది?" అన్నాడు వోల్గిన్. ఆ అబ్బాయి చెప్పాడు. నిఖాలస్‌ను కలిసి స్కూలును ఇంత దౌర్భాగ్యముగా ఎలా?

**(సశేషం)**

Read Our Internet Edition @
**www.holinessmagazine.com**

చిన్నపిల్లల పేజి




# కనిపించేవన్నీ మనం అనుకున్నట్లు ఉండవు

పిల్లలూ! మనం చాలా సందర్భాల్లో మనకు ఏదైనా కీడు జరిగితే దేవున్ని నిందిస్తాము. నాకెందుకు ఇలా జరిగింది. నేనేం పాపం చేశాను? దేవుడు నన్నెందుకు కాపాడలేదు? అని రకరకాలుగా మనం దేవున్ని మనసులో అనుకుంటుంటాము. అయితే మనకు జరిగేవన్నీ మనం అనుకుంటున్నట్లు ఉండవు. దేవుడు ఏం చేసినా మన మేలు కొరకే చేస్తాడు. మనం ఈ కథ చదివితే మనకు అర్ధమవుతుంది.

ఒకరోజు రెండు దూతలు ప్రయాణం చేస్తూ ధనవంతులైన ఒకరి యింటిలో ఆగి అక్కడ ఆ రాత్రి ఉండాలి అని అనుకున్నాయి. అయితే ఆ కుటుంబంలోని వారందరు మూర్ఖులు. వాళ్ళు ఆ దూతలను అక్కడ వారితో పాటు కలిసి ఉండటానికి కాని, వారి అతిధి గృహంలో ఉండటానికి కాని అంగీకరించలేదు. అయితే ఆ యింటివారు ఆ దూతలు ఉండటానికి యింటి క్రింద సెల్లార్‌లో ఉన్న ఒక గది ఇచ్చారు. కానీ అక్కడ పడుకోడానికి మంచాలు కానీ, చాపలు కాని లేవు. ఆ దూతలు ఆ ఇంట్లో క్రింద నేల మీద పడుకున్నారు. అందులో ఉన్న ఒక ముసలి దూత ఆ గది అంతా కలియ చూసింది. అక్కడ ఒక గోడకి ఉన్న రంధ్రం చూసి దాని సరిచేసింది. ఇంకో చిన్నదూత ఎందుకు నువ్వు దాని బాగుచేసావు అని అడిగింది. అప్పుడు ఆ ముసలి దూత మనకి కనిపించే విషయాలన్ని మనం అనుకున్నట్లు ఉండవు. వాటికి వేరే అర్ధం ఉంటుంది అని చెప్పింది. ఉదయాన్నే లేచి వారు ఆ యిల్లు విడిచి వెళ్ళిపోయారు.

ఆ రోజు రాత్రి వీరు ఒక పేద వారి యింటిలో ఆగారు. ఆ రెండు దూతలను వారు ఎంతో ప్రేమగా వారి అతిధి సత్కారాలతో చూసుకున్నారు. వాళ్ళు పడుకొనే మంచం ఆ దూతలు పడుకోవటానికి ఇచ్చారు. వాళ్ళకున్న కొంత భోజనంలోనే ఆ దూతలకు కూడా పెట్టారు. ఆ దూతలు ఆ రోజు అక్కడ ప్రశాంతంగా నిద్రపోయారు. మరుసటి రోజు ఉదయాన్నే ఆ దూతలు నిద్రలేచేసరికి ఆ భార్యభర్తలు ఇద్దరూ ఏడుస్తూ ఉన్నారు. వాళ్ళకి ఉన్న ఒకే ఒక ఆవు చనిపోయింది. అది వాళ్ళకి పాలిచ్చే ఆవు. వాళ్ళు

బ్రతకడానికి అదే ఆదాయం. అప్పుడు చిన్నదూత చాలా కోపంతో నువ్వు ఎందుకు దాన్ని ఇలా జరగనిచ్చావు? మొదటి కుటుంబం వారికి అన్నీ ఉన్నా వాళ్ళకి సహాయం చేసావు. కాని ఆ రెండవ కుటుంబం పేదవారైనప్పటికి వాళ్ళు మనల్ని ఎంతో బాగా చూసుకున్నారు. మనకు కావలసినవి అన్ని పెట్టారు. అయినా నువ్వు వాళ్ళ ఆవును చనిపోయేలా చేసావు ఎందుకు?


మనకి కనిపించినట్లు ఎప్పుడు అన్ని విషయాలు ఉండవు అని ముసలివాడైన దూత చెప్పాడు. మనం ఆ బంగళాలో క్రింద గదిలో ఉన్నప్పుడు ఆ రంధ్రంలో బంగారం ఉంది అది వాళ్ళకి కనిపించకుండ దాన్ని నేను మూసేశాను. నిన్న రాత్రి మరణ దూత ఈ యింటికి వచ్చి ఆమెని చంపాలని చూసింది. అందుకు నేను అడ్డుకొని ఆ మరణ దూతకి నచ్చచెప్పి వారు తమకు ఆతిధ్యమిచ్చినవారు కాబట్టి వారికి ఏ కీడు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మాకు ఉంది. కాబట్టి ఆమెకు బదులుగా ఆ ఆవుని చంపటానికి వారికి ఇచ్చాను అని చెప్పింది.

మనకి కనిపించే విధంగా అన్ని విషయాలు ఉండవు. మీకు కనుక మంచి హృదయం ఉంటే మీరు ఒక్కటే నమ్మాలి మనకొచ్చే ప్రతి కష్టం మనకు లాభం కొరకే. కొన్ని రోజులైన తర్వాత మీకే తెలుస్తుంది. ఎందుకిలా జరిగిందో. దీన్ని గురించి ఆలోచించండి. కష్టంలో మీరు భయపడి పారిపోతారా? లేకపోతే అంతా మన మంచి కొరకే అని దేవుని స్తుతిస్తారా?

## పాఠకులకు గమనిక

**'పరిశుద్ధత'** మాసపత్రికను మీరు ఎంతగానో ఆదరిస్తున్నందుకు మీకు మా కృతజ్ఞతలు. పత్రిక కావాలని అనేకమంది ఉత్తరాల ద్వారా, ఫోన్స్ ద్వారా అడుగుతున్నారు. “మీ పత్రిక ఫలానా చోట చూశాము. మీ పత్రిక చాలా బాగుందండీ, మా అధ్యాత్మిక జీవితానికి ఎంతో మేలుకరంగా ఉంది. దయచేసి మాకు కూడా పంపండి. మేము చందా కడతాము” అని అడుగుతున్నారు. అలా అడిగిన వాళ్ళందరికీ పంపాలంటే ఇప్పుడు చందా కట్టకుండా ఉచితంగా పత్రిక పొందుతున్న వాళ్ళందరికీ ఆపాలి. అందుకనే గత నెలలో పత్రికతో పాటు “పత్రిక కావాలా? వద్దా?” అనే విషయం పోస్ట్‌కార్డ్ ద్వారా తెలియజేయమని పోస్ట్‌కార్డ్ పంపించాము. అందువలన పోస్ట్‌కార్డ్ తిరిగి మాకు పంపని వాళ్ళందరికీ వరుసక్రమంలో పత్రిక ఆపివేయబడుతుంది. పత్రిక కావలసిన వాళ్ళు ఫోన్‌ద్వారా కాని, పోస్ట్‌కార్డ్ ద్వారా కాని తెలియజేయగలరు. నేటి పరిస్థితులలో పత్రిక నిర్వహణ చాలా వ్యయప్రయాసలతో కూడుకొని ఉన్నప్పటికీ, కేవలం విశ్వాసము ద్వారానే ఈ పత్రిక నిర్వహించగలుగు తున్నాము. అయితే పాఠకులు చందా కట్టడం తమ బాధ్యతగా గుర్తించాలి. ఎందుకంటే మీరు చందా కట్టటం వలన ఇంకా అనేకమందికి పత్రిక పంపడానికి సాధ్యమవుతుంది. సంవత్సరమంతటికీ కలిపి కేవలం 150/– రూపాయలు అన్నది ఎన్నతగినది కాదు. కావున పాఠకులు సహృదయముతో ఆలోచించి చందా కట్టవలసినగా ప్రభువు పేరట వేడుకొనుచున్నాను.

**– ఎడిటర్**





# బైబిలు చరిత్ర

*సేకరణ:* రెవ.డా॥ కె.జోసఫ్

**ద్వితీయోపదేశకాండము**–పరిచయం

ఇశ్రాయేలీయులు తమ సుదీర్ఘ ప్రయాణం ముగింపులో మోయాబు మైదానంలో ఉన్నప్పుడు, అంటే కనానులో ప్రవేశించబోయే ముందు మోషే వారితో చెప్పిన ఉపదేశాల అనుక్రమణిక ద్వితీయోపదేశకాండము గ్రంథం. మోషే వారికి నలభై సంవత్సరాల చరిత్రను జ్ఞాపకం చేయడాన్ని ఈ గ్రంథం ప్రాముఖ్యంగా వివరిస్తోంది.

**విషయసూచిక**

మోషే మొదటి ఉపదేశం 1:1–4:49

మోషే రెండవ ఉపదేశం 5:1–26:19

(ఎ) పది ఆజ్ఞలు 5:1–10:22

(బి) ఆజ్ఞలు, కట్టడలు, మరియు హెచ్చరికలు 11:1–26:19

కనానులో ప్రవేశించడం గురించి సూచనలు 27:1–28:68

నిబంధన పునరుద్ధరణ 29:1–30:20

మోషే తుదిపలుకులు 31:1–33:29

మోషే మరణం 34:1–12

**యెహోషువ**–పరిచయం

యెహోషువ గ్రంథం ఇశ్రాయేలీయులు మోషే తర్వాత తమ నాయకుడైన యెహోషువ నేతృత్వంలో కనానును స్వాధీనపర్చుకోడం గురించి వివరిస్తోంది. ఈ గ్రంథంలోని ప్రముఖ సంఘటనలు: యొర్దాను దాటడం, యెరికో పతనం, హాయి యుద్ధం, మరియు నిబంధన పునరుద్ధరణ.

**విషయసూచిక**

కనాను స్వాధీనం 1:1–12:24

స్వాస్థ్యాల పంపకం 13:1–21:45

(ఎ) యొర్దానుకు తూర్పునున్న ప్రాంతం13:1–33

(బి) యొర్దానుకు పడమరనున్న ప్రాంతం 14:1–19:51

(సి) ఆశ్రయపురాలు 20:1–9

(డి) లేవీయుల పట్టణాలు 21:1–45

తూర్పు ప్రాంతాల గోత్రాలు వారి స్వాస్థ్యాలకు తిరిగి వెళ్లడం 22:1–34

యెహోషువ వీడ్కోలు సందేశం 23:1–16

షెకెము వద్ద నిబంధన పునరుద్ధరణ 24:1–33

**న్యాయాధిపతులు**–పరిచయం

న్యాయాధిపతులు గ్రంథం ఇశ్రాయేలు చరిత్రలో కనాను స్వాధీనం తర్వాత రాచరికానికి ముందు నెలకొనిన అవ్యవస్థను వివరించే కథల సమాహారం. న్యాయాధిపతులని పేరుపొందిన ఇశ్రాయేలు వీరుల విజయాలే ఈ కథలు. వీరిలో అనేకులను న్యాయాధిపతులనడం కంటె యుద్ధాలను నడిపించిన నాయకులనడం సబబు.

**విషయసూచిక**

యెహోషువ మరణంవరకు జరిగిన సంఘటనలు 1:1–2:10

ఇశ్రాయేలు న్యాయాధిపతులు 2:11-16:31
వివిధ సంఘటనలు 17:1-21:25

**రూతు**-పరిచయం

న్యాయాధిపతులు గ్రంథంలో ప్రస్తావించిన విపత్కర పరిస్థితుల నేపథ్యంలో నడిచిన కథ రూతు గ్రంథం. మోయాబీయురాలైన రూతు ఇశ్రాయేలీయుణ్ణి వివాహం చేసుకుంటుంది. రూతు తన భర్త మరణించిన తార్వత ఇశ్రాయేలీయురాలైన తన అత్త నయోమిపట్ల అపూర్వమైన విధేయతను ఇశ్రాయేలు దేవునిపట్ల ప్రగాఢమైన భక్తిని ప్రదర్శించింది. తుదకు రూతు తన భర్త బంధువును వివాహం చేసుకొంది. ఇశ్రాయేలులో ఘనత వహించిన రాజు దావీదుకు రూతు ముత్తవ్వ.

**విషయసూచిక**

నయోమి రూతుతోబాటు బేత్లెహేముకు తిరిగి రావడం 1:1-22
రూతు బోయజును కలుసుకోనడం 2:1-3:18
బోయజు రూతుల వివాహం 4:1-21

**మొదటి సమూయేలు**-పరిచయం

ఇశ్రాయేలు చరిత్రలో న్యాయాధిపతుల తర్వాత రాచరికానికి ముందున్న సంధికాలంనాటి సంఘటనలను మొదటి సమూయేలు గ్రంథం వివరిస్తోంది. ఈ గ్రంథంలో ప్రముఖులు: చివరి న్యాయాధిపతి సమూయేలు, ఇశ్రాయేలు మొదటి రాజు సౌలు, మరియు దావీదు. అంతే కాదు. దావీదు రాజు కావడానికి పూర్వం అతని సాహసకార్యాలు సమూయేలు సౌలుల వృత్తాంతాల నడుమ కనిపిస్తాయి. పాత నిబంధనలోని ఇతర చారిత్రక కథనాల్లాగానే ఈ గ్రంథం కూడ దేవునిపట్ల విధేయత విజయానికి నడిపిస్తుందని, అవిధేయత అనర్థాలకు నడిపిస్తుందని వివరిస్తోంది.

**విషయసూచిక**

ఇశ్రాయేలు న్యాయాధిపతిగా సమూయేలు 1:1-7:17
సౌలు రాజు కావడం 8:1-10:7
సౌలు పరిపాలనలో తొలి సంవత్సరాలు11:1-15:35
దావీదు, మరియు సౌలు 16:1-30:31
సౌలు, మరియు అతని కుమారుల మరణం 31:1-13

**రెండవ సమూయేలు**-పరిచయం

మొదటి సమూయేలు గ్రంథానికి తరువాయి భాగమైన రెండవ సమూయేలు గ్రంథం దావీదు రాజు పాలన గురించి తెలియజేస్తోంది. దావీదు తొలుత దక్షిణంలోని యూదాకు (1-4 అధ్యాయాలు), తర్వాత ఉత్తరంలోని ఇశ్రాయేలుతో సహా (5-24 అధ్యాయాలు) యావత్ దేశానికి రాజుగా వున్నాడు. దావీదుకు రాజ్యవిస్తరణలోను, అతను రాజుగా తనను సమీకరించుకోడంలోను దేశంలోపల దేశం వెలుపల శత్రువులనుండి ఎటువంటి సంఘర్షణ లెదురయ్యాయో ఈ గ్రంథం వివరిస్తోంది. దేవుని పట్ల అచంచల భక్తివిశ్వాసాలను ప్రదర్శించిన దావీదు ప్రజాభిమానాన్ని పొందిన సమర్థుడు కూడ.

**విషయసూచిక**

యూదామీద దావీదు పాలన 1:1-4:12
యావత్ ఇశ్రాయేలు మీద దావీదు పాలన 5:1-24:25
(ఎ) తొలి సంవత్సరాలు 5:1-10:19
(బి) దావీదు, బత్షెబ 11:1-12:25
(సి) శ్రమలు, కష్టాలు 12:26-20:26
(డి) చివరి సంవత్సరాలు 21:1-24:25

**మొదటి రాజులు**-పరిచయం

మొదటి రాజులు గ్రంథం సమూయేలు గ్రంథాల్లో ప్రారంభమైన ఇశ్రాయేలు రాజుల చరిత్రను కొనసాగిస్తోంది. ఈ గ్రంథంలోని మూడు ముఖ్యభాగాలు: (1) దావీదు రాజు మరణానంతరం అతని కుమారుడు ఇశ్రాయేలు యూదాలకు రాజు కావడం; (2) సొలొమోను

పరిపాలన, మరియు అతని కార్యసిద్ధి – ప్రాముఖ్యంగా యెరూషలేములో దేవాలయ నిర్మాణం; (3) ఉత్తర దక్షిణ రాజ్యాలుగా దేశవిభజన, క్రీస్తు పూర్వం తొమ్మిదవ శతాబ్ధం మధ్య కాలంవరకు పరిపాలించిన రాజుల వృత్తాంతాలు. దేవునిపట్ల విధేయత చూపడం మానవద్దని, విగ్రహాలను పూజించవద్దని ప్రకటించిన ప్రవక్తల్లో అగ్రగణ్యుడైన ఏలీయా ఈ గ్రంథంలో కనిపించే వేరొక ప్రముఖుడు.

**విషయసూచిక**

దావీదు పరిపాలన చివరి దినాలు 1:1–2:12

సొలొమోను రాజు కావడం 2:13–46

సొలొమోను పరిపాలన 3:1–11:43

(ఎ) తొలి సంవత్సరాలు 3:1–11:43

(బి) దేవాలయ నిర్మాణం 5:1–8:66

(సి) చివరి సంవత్సరాలు 9:1–11:43

విభక్త రాజ్యం 12:1–22:53

(ఎ) ఉత్తర గోత్రాల తిరుగుబాటు 12:1–14:20

(బి) యూదా, మరియు ఇశ్రాయేలు రాజులు 14:21–16:34

(సి) ఏలీయా ప్రవక్త 17:1–16:34

ఇశ్రాయేలు రాజు ఆహాబు 20:1–22:40

యూదా రాజు యెహోషాపాతు, మరియు ఇశ్రాయేలు రాజు అహజ్యా 22:41–53

### **రెండవ రాజులు**–పరిచయం

మొదటి రాజులు గ్రంథంలోని రెండు రాజ్యాల చరిత్రనే రెండవ రాజులు గ్రంథం కొనసాగిస్తోంది. ఈ గ్రంథంలోని రెండు ముఖ్యభాగాలు: (1) క్రీస్తు పూర్వం తొమ్మిదవ శతాబ్దం మధ్య కాలంనుండి షోమ్రోను పతనం వరకు రెండు రాజ్యాల చరిత్ర, మరియు క్రీ.పూ. 722లో ఉత్తర రాజ్య పతనం; (2) ఇశ్రాయేలు రాజ్యపతనంనుండి క్రీసపూ. 586లో బబులోను రాజైన నెబుకద్నెజరు యెరూషలేమును ముట్టడించి నాశనం చేయడం వరకున్న చరిత్ర. ఏలీయా ప్రవక్త తర్వాత ప్రవక్తగా ఉన్న ఎలీషా రెండవ రాజులు గ్రంథంలో కనిపించే మరొక ప్రముఖుడు.

**విషయసూచిక**

విభక్త రాజ్యం 1:1–17:41

(ఎ) ఎలీషా ప్రవక్త 1:1–8:15

(బి) యూదా, మరియు ఇశ్రాయేలు రాజులు 8:16–17:4

(సి) షోమ్రోను పతనం 17:5–41

యూదా రాజ్యం 18:1–25:30

(ఎ) హిజ్కియా నుండి యోషీయా వరకు 18:1–21:26

(బి) యోషీయా పరిపాలన 22:1–23:30

(సి) యూదా చివరి రాజులు 23:31–24:20

(డి) యెరూషలేము పతనం 25:1–30

### **మొదటి దినవృత్తాంతములు**–పరిచయం

సమూయేలు గ్రంథాలు మరియు రాజులు గ్రంథాల్లో జరిగిన సంఘటనలే మొదటి దినవృత్తాంతములు గ్రంథంలో భిన్న కోణంనుండి వివరించబడ్డాయి. ఇశ్రాయేలు మరియు యూదా రాజ్యాలకు ఎదురైన ఆపత్కాలంలో సైతం, దేవుడు వారిపట్ల చేసిన వాగ్దానాలు నిలిచే వున్నాయని తన ప్రజల ద్వారా ఆయన తన సంకల్పం నెరవేరేలా చేస్తాడని దినవృత్తాంతములు గ్రంథాలు వివరిస్తున్నాయి.

**విషయసూచిక**

వంశావళులు, మరియు పట్టికలు 1:1–9:44

సౌలు మరణం 10:1–14

దావీదు పరిపాలన 11:1–29:30

(ఎ) కష్టాలు, మరియు విజయాలు 11:1–22:1

(బి) దేవాలయ నిర్మాణానికి ఏర్పాట్లు 22:2–29:30

**(సశేషం)**



బ్రదర్ కె.సామ్రాట్

5

# మధ్యకాలము

**(ప్రవక్తయైన మలాకీ కాలము నుండి బాప్తిస్మమిచ్చు యోహాను వరకు గల మధ్యకాలములోని యూదుల చరిత్ర)**

ఈ సిరియా సైన్యమందు రాజును లిసియాస్‌ను ఉండి యూదాను లొంగిపొమ్మని బలవంతము చేసిరి. ఎపిఫనేస్ తన మరణపడక మీద తన కుమారునికి రక్షక భటునిగా నియమించిన ఫిలిప్పు అంతియొకస్‌ను ముట్టడివేసి సిరియా సామ్రాజ్యము యొక్క ప్రభుత్వ భారములను తీసికొనుటకై వారు లేని సమయమును అవకాశముగా తీసికొనెను.

ఈ వార్త వినిన లిసియాస్ తక్షణమే గౌరవనీయమైన అవకాశములతో కూడిన పదములతో యూదయ దేశమును పాలించు యూదాతో సమాధానపడెను. అది ప్రమాణాలతో చేసిన సంధి అయినను యూపటూర్ ఆలయము యొక్క భద్రత స్థలమును నిర్మూలించుటకు ఆజ్ఞ యిచ్చెను.

మెనీలాస్ అను కౄరుడైన ప్రధానయాజకుడు తన స్వంత జనమునే నశింపచేయుటకు అన్యులను కసాయి జనులను ప్రేరేపించుచుండగా లిసియాస్ ద్వారా చిత్రహింస పెట్టబడెను. యూదుల మీద దండయాత్రలు జరిగించుటకు అతడే మూలకారణము. గనుక అతనిని సిరియా పట్టణములోని ఒక ప్రాంతమైన 'భరియా' అను ప్రాంతమునకు పోవలెనని ఆజ్ఞాపింపబడెను. అక్కడ ఒక బూడిదతో నిండిన గోపురము నకు ఒక పెద్ద చక్రము అమర్చబడియుండును. అది ఎప్పుడూ తిరుగుచూ అందులో వేయబడిన హంతకుని ఊపిరి సలప కుండా చంపును. అలాటి గోపురముపై మెనీలాస్ వేయబడెను. పర్షియా దేశములో పెద్ద తరహా నేరస్తులను ఈ విధముగా శిక్షింతురు. ఈ కౄరుడైన ప్రధానయాజకుని తర్వాత మరొక కౄరుడు అల్సియస్ అను వ్యక్తి అంతియొకస్ యుపేటర్ ద్వారా ప్రధానయాజకునిగా ఎన్నుకొనబడెను. ఇతను కూడా ముందు వ్యక్తివలె కౄరుడైయుండెను.

యుపేటర్ ఇంటికి తిరిగివచ్చి సుళువైన యుద్ధముల ద్వారా బలత్కారముతో తీసికొని రాబడిన ఫిలిప్పును చంపివేసి అతనికి అనుకూలముగా ఇవ్వబడిన ఉపదేశములను, తొలగించెను. దెమెత్రియస్‌ను మాత్రం అలాగు చేయలేదు. సెల్యూకస్ ఫిలేపేటర్ కుమారుడు అయిన దెమెత్రియస్ చిన్నవాడైనందున అతని పినతండ్రి యగు ఎపిఫనెస్ రాజ్యమునకు తన సోదరుని యొక్క హక్కుగా వారసుడాయెను.

దెమెత్రియస్ తన తండ్రి మరణించిన సం॥లో సంధి షరతులు నెరవేర్చుటకై తన పినతండ్రియగు అంతియొకస్ ఎపిఫనేస్‌కు బదులుగా రోమా పట్టణమునకు పంపబడెను. కారణమేమనగా దెమెద్రియస్ ఇంకా చిన్నవాడైయుండెను. అంతియొకస్ దానిని అవకాశముగా తీసికొని తనను రాజుగా ప్రకటించుకొనెను. ఎవరియొద్ద దెమెత్రియస్ విద్యాభ్యాసము చేసెనో ఆ మంత్రుల ఆలోచనలను తీసికొని అతని రాజ్యము అతనికివ్వమని వేడుకొనెను. యుపేటరుని పరిపక్వమైన అనుభవజ్ఞునిగా గుర్తింపవలెనని కోరుకొనెను. కాని ఈ అనుమతి పత్రము ద్వారా నిరాకరింపబడినను దెమెత్రియస్ సిరియాలోని త్రియోపోలిస్‌కు సురక్షితముగా వచ్చెను. తన తండ్రి యొక్క రాజ్యమును పొందునట్లు రోమీయులచేత ప్రోత్సహించబడెను. ఈ కపటోపాయపు ఆసక్తి వలన యుపేటర్ నుండి దెమెత్రియస్ వైపు మళ్ళిరి. సైనికులందరు యుపేటర్‌ను ముట్టడివేసి దెమెత్రియస్ చేతులకు అప్పగించగా దెమెత్రియస్ అతనిని చంపునట్లు ఆజ్ఞాపించెను. ఆ తరువాత రాజ్యమంతటిని ఆక్రమించుకొని స్థిరపడెను.

ఈ మధ్యకాలములో యూదులు ఎంతో నెమ్మదిగా నుండిరి. శ్రమకాలములో అతడు యూదా మతమును విసర్జించిన వాడైనందున అల్సియస్ అను ప్రధాన యాజకుని అనుకరించుటకు నిరాకరించెను. అల్సియస్ క్రొత్తరాజైన

దెమెత్రియస్‌ను యూదా మక్కబీయును నుండి రక్షణ కల్పించమని విన్నవించుకొనెను. మరియు అనేక అబద్ధములు కల్పించి రాజునకు ఉద్రేకము కల్గించెను. కనుక దెమెత్రియస్ బక్కిదెస్‌ను సైన్యముతో యూదయ మీదకు వెళ్ళమని ఆజ్ఞాపించెను. మరియు అల్సియస్ మతద్రోహి అనునది కూడా రుజువు చేయమనెను.

అల్సియస్, బక్కిదేస్‌తో కలిసి యూదాతో యుద్ధము జరిగించు కార్యముకై పూనుకొనెను. యూదులు ప్రశాంత వాతావరణమునకై సంధి చేసికొనిరి. శాస్త్రులును, మతాధికారులును వారి అధికారములో ఉంచుకొనిరి. ఒక్క దినమందే వారిలో అరవైమందిని చంపిరి. డక్నెదెస్ కొంత సైన్యబలముతో అతనిని విడిచి అనేక హత్యలు జరిగించెను. చివరిగా దెమెత్రియస్ నుండి మరొక సైన్యమును నికనార్ ఆజ్ఞ వలన యూదాను నాశనము చేయుటకై అతనిని వెంబడించు వారిని చెదరగొట్టుటకు ప్రధానయాజకుని స్థానంలో అల్సియస్‌ను ఉంచునట్లు సహకరించుటకై పంపెను. నికనార్ యూదా యొక్క బలశౌర్యములు తెలిసినవాడై అతనితో సంధిచేసుకొనుటకు కబురుపెట్టెను. కాని అల్సియస్ మాత్రము యుద్ధము వలన తనకు లాభమని తలచి రాజ్యము కొట్టెను. అందువలన మొదటి ఆజ్ఞను నికనార్ నిరాకరించి పలుయుద్ధములలో విజయము సాధించుచూ బేతొరాన్ అను గ్రామ సమీపములో యుద్ధము జరుగుచుండగా నికనార్ చంపబడెను. మరియు అతని 35,000 మంది సైన్యము కూడా ఆయుధములు క్రిందపడవేసిరి. ఈ విజయమును ప్రతి సంవత్సరము కృతజ్ఞతారాధనతో హార్షిక దినముగా జరుపుకొనిరి.

సిరియనులు రాజద్రోహముల గురించి ఏ మాత్రము శ్రద్ధ వహించకపోవుట గమనించెను. రోమీయులతో సంబంధము ఏర్పరచుకొనినచో దేశము అలాంటి ద్రోహుల నుండి సురక్షితముగా ఉండగలదని ఊహించెను. గనుక జాసన్ మరియు యుపొలేమెయాస్ అనువారిని రోమా పట్టణమునకు పంపగా వారిరువురి మధ్య శాంతి సమాధానములను సంధిని వెంటనే రోమీయులు అనుమతించి పంపిరి. దెమెత్రియస్‌తో యుద్ధము చేయకుండా ఆగినందుకు అతడు యూదులకు ఎలాంటి కష్టముగాని, సమస్యలుకాని ఇవ్వకూడదని జారీచేయబడిన ఉత్తరమును కూడా దెమెత్రియస్‌కు అందజేసిరి.

ఏదిఏమైనా ఇదంతా క్రియచేయలేదు. కొంతకాలమైన తర్వాత ఈ సంధి తప్పిపోవుచుండగా దెమెత్రియస్ నికనార్ మరణమునకు, ఓటమికి ప్రతీకారము తీర్చుకొనుటకై అనేకమంది సైనికులతో బక్కియాస్, అల్సియస్‌లను యూదయపై దండయాత్రకు పంపెను. ఈ సమయములో వారిని ఎదుర్కొనుటకు యూదాకు 3,000 మంది సైన్యము కంటే ఎక్కువమంది లేకపోయిరి. వారియొక్క శత్రువుల బలము సంఖ్య తెలిసికొని వారిలో 800 మందిని వారి సంస్థానమున విడిచివెళ్ళిరి. అయినను దేవుని చిత్తమునకు లోబడుటకు నిరాకరించెను.

ఆ ధైర్యశాలులతో కలసి బక్కయాస్ తానే స్వయముగా ఏర్పరచిన కుడిరెక్కను విరుగగొట్టెను. అజోతాస్ పర్వతముల వరకు వారని తరిమివేసెను. ఈ చిన్న సైన్యము ఎడమ కిటికి ద్వారా వారిని వెంబడించి ముట్టడి వేయకుండినట్లయితే వారు పూర్తి విజయము సాధించియుండెడివారు. గొప్ప బలమైన సైన్యముతో ముట్టడి వేయబడి వారి ప్రాణములను ఎక్కువ ఖరీదునకు అమ్ముకొనిరి. యూదా చంపబడెను మరియు అతనిని రక్షించవలెననుకొనిన వారు పారిపోయిరి.

యూదా మృతదేహము సీమోను, యోనాతాను అను వాని సహోదరులచే వారి పూర్వీకుల సమాధుల యొద్ద "మోదిన్"లో సమాధి చేయబడెను. అతడు కోరుకొనిన విధముగానే గౌరవనీయమైన అంత్యక్రియలు జరిగింపబడెను.

బక్కిదెస్ అతని తర్వాత పూర్తిదేశాన్ని ముట్టడివేసి మక్కబీయుల సహాయులందరిని క్రూరముగా వాడుకొనెను. యోనాతాను దేశపు పెద్దగా విరమించుకొని విసుగుచెంది తెకోవా అరణ్యములోనికి పోగా ఈ చిన్నసైన్యము ఒకప్రక్క తడినేలను, రెండవప్రక్క యోర్దాను నదిని ముట్టడివేసిరి. బక్కిదేశ్ వారిని వెంటాడి వారు ముట్టడి వేయు స్థలము చుట్టూ భద్రతా దళమును ఉంచి దాని ద్వారా సబ్బాతు దినమందు ఎదుర్కొనిరి.

**(సశేషం)**


# ఎంతైనా నమ్మదగిన దేవుడు

మన సహోదరుడును మన రక్షకుడును మన ప్రాణ ప్రియుడును అయిన యేసుక్రీస్తు అను అద్భుతములు చేయు నామమున పరిశుద్ధత మాసపత్రిక చదువుతున్న మీ అందరికి నా హృదయ పూర్వక వందనములు అందరు ఆరోగ్యముతో ఆనందముతో ఉండాలని యేసుక్రీస్తు ప్రభువు వారి నామమున కోరుచున్నాను నిజముగా దేవుడు ఎంతైన నమ్మదగినవాడు అని చెప్పుటకు నేను అతిశయపడుచున్నాను ఎందుకంటే అలా చెప్పగలిగిన గొప్ప కార్యములు దేవుడు నా జీవితములో చేసియున్నాడు. ఈ పత్రిక చదువుచున్న ప్రతి ఒక్కరి జీవితములోను దేవుడు అద్భుతములు చేసి యుంటాడు అనుటలో సందేహం ఏమిలేదు. ఎందుకంటే మనం విశ్వసించి నమ్మిన దేవుడు ఆశ్చర్యకార్యములు, అద్భుత కార్యములు చేయుటకు సమర్థుడు హల్లెలూయ.

అలాగే యేసు ప్రభువారు నా జీవితములో చేసిన అనేక మేలులలో కొన్నింటి ద్వారా మిమ్ములను ఆత్మీయంగా బలపరచాలని ఆశిస్తున్నాను. 2005 సం॥లో ఒక రోజు నా భర్త మనము సింగపూర్ వెళ్ళుతున్నాము అని చెప్పారు. నాకు చాలా ఆశ్చర్యము కలిగింది. ఎందుకంటే ఇది వరకు నేను ఎప్పుడు విమానం ఎక్కలేదు విదేశాలకు వెళ్ళలేదు. నా భర్త చెప్పిన విషయం నాకు చాలా సంతోషం కలిగించింది. విదేశాలకు వెళ్ళలన్నా విమానం ఎక్కాలన్న ఎవరికి ఇష్టం లేకుండా వుంటుంది. కొందరికి విమానం ఎక్కాలంటే భయం అంతేకాని విదేశాలకు వెళ్లి చూడాలని లేదా, అక్కడి సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని చాలా ఇష్ట పడుతుంటారు. అలాంటి వారిలో నేను ఒకదానిననే చెప్పాలి. అయితే టికెట్స్ కొనుటకు మాకు అంత డబ్బు ఒక్కసారి కష్టం. అయితే సృష్టికర్త అయిన దేవునికి ఇది సాధ్యమే. పరిశుద్ధ గ్రంథమైన బైబిలులో ఇలా వ్రాయబడి ఉంది. నాయందు మీరును మీయందు నా మాటలను నిలిచి యుండిన యెడల మీకేది ఇష్టమో అడుగుడి అది మీకు అనుగ్రహింపబడును అను వాక్యం నాకు గుర్తుకు వచ్చింది. వెంటనే నేను దేవుని సన్నిధిలో ఆ వాక్యాన్ని పెట్టి అడగటం ప్రారంభించాను. అద్భుతంగా దేవుడు మాకు ఎంత ధనము అయితే అవసరమైయున్నదో అది అంత మాకు సకాలములో మేము పొందుకొన గలిగాము. నిజమే కొన్ని సార్లు దేవుని సన్నిధిలో ఆయన మనకు ఇచ్చిన వాగ్దానములోని వాక్యాన్ని పెట్టి ప్రార్థిస్తు వుండాలి. అవి మన జీవితములో నెరవేరాలంటే మన హృదయములో భద్రము చేసుకొని తలపోసుకుంటు వుండాలి. అలాగే దేవుడు మా హృదయ వాంఛ తీర్చాడు.

అయితే మేము సింగపూర్ వెళ్ళే ఫ్లైట్ లోనికి ఎక్కుటకు బయలుదేరాము. అనేకమంది వరుసగా ఎక్కి లోపలికి వెళ్ళిపోయారు. నేను లోపలికి అడుగు పెట్టే ముందు నా హృదయంలో ఒక మాట దేవుని అడగాలి అనిపించింది. యేసయ్య ఇంత ధన్యత ఇచ్చినందుకు నీకు వందనములు. ఈ విధంగానే అనేక దేశాలకు వెళ్ళి నీ సువార్త ప్రకటించుటకు నాకు ధన్యత దయచేయ్యి తండ్రి అని అడిగి నా మొదటి అడుగు విమానంలో పెట్టటం జరిగింది ఈ విధంగా అడగటం తప్పేమి కాదు మార్కు 16:15 లో వ్రాయబడిన ప్రకారం మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటించుడి. నిజంగా ఆ సమయంలో ఆ మాటలు నా హృదయంలో గుర్తు తెచ్చిన పరిశుద్ధ దేవునికి నేను వందన ములు

**...మిగతా 18వ పేజిలో**




# క్రైస్తవ జీవితము

ప్రియ పరిశుద్ధత పాఠకులకు మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తు నామమున శుభాభివందనములు. ఈ సంచికలో పరిశుద్ధ గ్రంథమందు క్రైస్తవ జీవితమును గూర్చి తెలుసు కుందాము.

సంఘ విధులు : విశ్వాసులకు దేవుని ఆజ్ఞలు : ప్రార్థించుట, రక్షణ మరియు దేవుని ఆరాధించు విధములు.

## దేవుని నుండి క్రైస్తవునికి 7 దైవిక పిలుపులు

1. రక్షణ పిలుపు రోమా 8:28-30
2. పాప విమోచన పిలుపు 1థెస్స. 4:3, 5:23,24
3. సేవకై పిలుపు యోహాను 15:16; 1కొరింథీ. 1:26; ఎఫెసీయులకు 2:10
4. ప్రత్యేకించబడుటకు పిలుపు 2కొరింథీ. 6:14-18
5. కుమారత్వపు పిలుపు. 1యోహాను. 3:1
6. లోబడుటకు పిలుపు రోమా 13:4,5
7. శ్రమ పడుటకు పిలుపు యోహాను 16:33; అపో.కార్య 14:22; ఫిలిప్పీ 1:29,3:10; 1థెస్స. 3:3; 1పేతురు 2:21

## పరిశుద్ధ గ్రంథమును పఠించుట వలన 9 ప్రయోజనములు

1. మనము స్థిరపడుటకు సహాయము చేయును. ఎఫెసీ 4:14
2. క్రైస్తవ్యములోని వక్ర సిద్ధాంతములు, తప్పుడు బోధల నుండి మనలను కాపాడును. 1తిమోతి 4:13-16
3. దేవుని ప్రతిబింబించుటలో మనకు సహాయము చేయును. 2తిమోతి 2:15
4. మనకు మనము జాగ్రత్త పడుటకు సహాయము చేయును. 2తిమోతి 3:13-17; ఎఫెసీ 6:10-17
5. ఇశ్రాయేలీయుల చరిత్ర మనము తెలిసికొందుము. 1కొరింథీ 10:1-5
6. ఇశ్రాయేలీయుల పునఃస్థాపన మనకు అర్థమగును. రోమా 11:25
7. ఆత్మీయ వరములను గూర్చి మనము నేర్చుకొందుము. 1కొరింథీ 12:1
8. ప్రభువైన క్రీస్తు పునరాగమనమును గూర్చి మనకు బోధించును. 1థెస్స. 4:13-17
9. ఈ ప్రపంచ నాశనమును గూర్చి మనకు అర్థమగును.

## ప్రభువైన క్రీస్తు తన తీర్పు సింహాసనము యొద్ద పరీక్షించు 12 లక్షణములు

1. మనము ఇతర విశ్వాసుల యెడల ఏ విధముగా ప్రవర్తించితిమి? హెబ్రీ 6:10; మత్తయి 10:41,42
2. మనము ఏ విధముగా మన అధికారమును ఇతరుల యెడల అమలుపరచితిమి? హెబ్రీ. 13:17; యాకోబు 3:1
3. దేవుడు మనకనుగ్రహించిన వరములను సామర్థ్యములను ఏ విధముగా ఉపయోగించితిమి? 1కొరింథీ. 12:4,11; 2తిమోతి 1:6. 1పేతురు 4:10
4. మన ధనమును మనము ఏ విధముగా ఉపయోగించితిమి? 1కొరింథీ. 16:2; 2కొరింథీ. 9:6,7; 1తిమోతి 6:17-19
5. మన సమయమును మనము ఏ విధముగా వినియోగించితిమి? కీర్త. 90:12; ఎఫె. 5:16; కొలొ. 4:5; 1పేతురు 1:17
6. మనము క్రీస్తు కొరకు ఎంత శ్రమ ననుభవించితిమి? మత్తయి 5:11,12; మార్కు 10:29,30; రోమా 8:18; 2కొరింథీ 4:17; 1 పేతురు 4:12,13
7. దేవుడు మన కొరకు ఎన్నిక చేసిన ప్రత్యేకమైన పరుగు పందెమందు మనం ఏ విధముగా పరుగెత్తితిమి? 1కొరింథీ 9:24; ఫిలిప్పీ 2:16, 3:13,14; హెబ్రీ 12:1
8. పాత స్వభావమును మనము ఎంతవరకు నిగ్రహించుకొంటిమి? 1కొరింథీ 9:25-27

9. ఎన్ని ఆత్మలకు మనము సాక్ష్యముగా నిలిచితిమి మరియు ఎన్ని ఆత్మలను మనము క్రీస్తుకొరకు సంపాదించితిమి? సామెతలు 11:30; దానియేలు 12:3; 1థెస్స 2:19,20

10. శోధనలలో మనం ఏ విధముగా స్పందించుచున్నాము? యాకోబు 1:2,3; ప్రకటన 2:10

11. మనం దేవుని రాకడ కొరకు ఎంతవరకు కనిపెట్టు కొని యున్నాము? 2తిమోతి 4:8,9

12. దేవుని వాక్యమందును దేవుని మంద యెడలను మనం ఎంత విశ్వాసము కలిగియున్నాము? అపో.కా 20:26-28; 2తిమోతి 4:1,2; 1పేతురు 5:2-4

## పరలోక రాజ్యమునకు కొనిపోబడువరకు క్రైస్తవుడు నిర్వర్తించవలసిన 10 విధులు

1. క్రమముగా సంఘారాధనలో పాల్గొనవలెను. హెబ్రీ. 10:25

2. ప్రభువు బల్లలో పాల్గొనునప్పుడెల్ల ఆయన మరణమును జ్ఞాపకము చేసికొనవలెను. 1కొరింథీ 11:26

3. విశ్వాసులను అదే విధంగా మనుష్యులందరిని ప్రేమించ వలెను. 2థెస్స. 3:12,13

4. ఓపిక కలిగియుండవలెను. యాకోబు 5:8

5. ప్రత్యేక జీవితమును జీవించవలెను. 1యోహాను 3:2,3

6. ఎవరిని గూర్చి తీర్పు తీర్చకూడదు. 1కొరింథీ 4:5

7. దేవుని వాక్యమును ప్రకటించవలెను. 2తిమోతి 4:1

8. ఇతరులను ఆదరించవలెను. 1థెస్స. 4:16,18

9. దేవుని కొరకు ఆత్మలను సంపాదించవలెను. యూదా 21-23

10. పరలోక సంబంధులవలె జీవించవలెను. కొలొస్స 3:1-4

**మన ధనమును దేవునికి ఇచ్చుటకుగల 5 కారణములు**

1. దేవుని యొక్క పని ప్రోత్సహించబడును. 1తిమోతి 5:17,18

2. మన జీవితములు ఆశీర్వదించబడును. సామెతలు 3:9,10, 28:20; మలాకీ 3:10; లూకా 6:38; 2 కొరింథీ 9:6

3. ఇతర క్రైస్తవులు కూడ సవాలుగా తీసుకొనెదరు. 2 కొరింథీ 9:2

4. తండ్రియైన దేవుడు మహిమ పరచబడును. 2కొరింథీ 9:12

5. అవసరతలోనున్న విశ్వాసులు ఆదరించబడెదరు. అపో.కా 11:29; 1యోహాను 3:17

**16వ పేజీ తరువాయి....**

తెలియజేసాను. అక్కడ ఉన్న 10 రోజులు అనేక సేవా కార్యక్రమలలో పాల్గొనుటకు దేవుడు నాకు అవకాశం కలిగించాడు. ఆ తరువాత 2006లో ఒకరోజు మా మామయ్య గారైన జోసఫ్‌గారు మనము ఆఫ్రికాలోని ఘనా అను ఊరికి ట్రైనింగ్ నిమిత్తము 10 మంది వెళ్ళవలసి ఉన్నది అని చెప్పారు. వారిలో నేను ఉండటం నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది అప్పుడు నేను చేసిన ప్రార్ధన గుర్తుకు వచ్చి దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించాను అయితే మేము వెళ్ళవలసిన సమయం ఆసన్నమైనది. ఇక రేపు మేము వెళ్తాము అనగా నా చిన్న కుమారుడైన హోలి బ్లెసింగ్ 6 సం॥లు బాబు సైకిల్ మీద నుండి పడటం జరిగింది డాక్టర్ దగ్గరకు తీసుకొని వెళ్ళినప్పుడు చేతి ఎముక విరిగినదని చెప్పి చేతికి పిండికట్టు వేశారు. ఇప్పుడు నేను ఏమి చేయాలి ఆఫ్రికా దైశానికి బైబిల్ ట్రైనింగ్‌కి వెళ్లాలా? నా కుమారుని దగ్గర నేను వుండాలా? చాలా దుఃఖము బాధ, నా కుమారుని వదలి వెళ్లటం నాకు ఇష్టము లేదు. అయితే టికెట్స్ వీసా అంతా నా పేరు మీద వచ్చేసింది. ఆ రాత్రి దేవుని సన్నిధిలో మోకరించి ప్రార్ధించటం మొదలు పెట్టాను. అప్పుడు దేవుడు నాకు ఒక వాక్యాన్ని గుర్తు చేశాడు మార్కు 10:29 ఆ వాక్యాముతో దేవుడు నన్ను బలపరిచాడు. వెంటనే నేను దేవుని సువార్త నిమిత్తము వెళ్ళుటకు సిద్ధపడ్డాను. ఆ విధంగా దేవుడు నన్ను ఆఫ్రికా దేశములో 30 రోజులు దేవుని పరిచర్యలో బలంగా వాడుకున్నాడు. కాబట్టి ఈ సాక్ష్యము చదువుచున్న మీకు కూడా దేవుడిచ్చు ఆశీర్వాదాలకు ముందు అనేకమైన శ్రమలు శోధనలు ఎదురౌతుంటాయి. వాటిని ఎదిరించినప్పుడు మనం గొప్ప విజయం పొందుకోగలము. ఆమెన్. వచ్చేనెలలో మరియొక విదేశి ప్రయాణంలో దేవుని పరిచర్యలో అనుభవాలతో సాక్ష్యములతో మీ ముందు ఉంటాను. దేవుడు మిమ్మును దీవించును గాక! ఆమెన్.



శ్రీమతి రిబ్కా విక్రాంత్

# దేవుని తీర్పులు

ప్రియ పరిశుద్ధత పాఠకులకు మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తు నామమున శుభాభివందనములు. ఈ సంచికలో పరిశుద్ధ గ్రంథమందు దేవుని తీర్పులు గూర్చి తెలుసుకుందాము.

## గతించిన తీర్పులు

1. ఏదేను వనములోని తీర్పు. ఆది 3:14-19; రోమా 5:12; 1 కొరింథీ 5:22
2. జలప్రళయము ద్వారా జరిగిన తీర్పు. ఆది 6:5-7; 2పేతురు 3:1-6
3. అష్షూరీయుల ద్వారా ఇశ్రాయేలీయులకు జరిగిన తీర్పు. 2 రాజులు 17 అధ్యాయము
4. బబులోనీయుల ద్వారా ఇశ్రాయేలీయులకు జరిగిన తీర్పు. 2 రాజులు 24,25 అధ్యాయములు
5. కల్వరి తీర్పు. మత్తయి 27:33-37; యెషయా 53:1-10; కీర్తనలు 22:1; హెబ్రీ 2:9; 1పేతురు 2:21-25, 3:18
6. రోమీయుల ద్వారా యూదులకు తీర్పు. మత్తయి 24:2; లూకా 19:41-44
7. స్థానిక సంఘముల మీద ప్రభువు యొక్క తీర్పు. ప్రకటన 2-3 అధ్యాయములు

## ప్రస్తుతకాల తీర్పులు

1. విశ్వాసి తనను తాను విమర్శించుకొనని యెడల ప్రభువు విధించు తీర్పు. 1 కొరింథీ 11:31; 1యోహాను 1:9
2. విశ్వాసులకు దేవుని ఇంటి యొద్ద ఆరంభమగు తీర్పు. అపొ.కా 5:1-11; 1 కొరింథీ 11:30; హెబ్రీ. 12:3-13; 1 పేతురు 4:17; 1 యోహాను 5:16

## భవిష్యత్తులో జరుగు తీర్పులు

1. క్రీస్తు న్యాయపీఠము యెదుట జరుగు తీర్పు. రోమా 14:10; 1 కొరింథీ 3:9-15; 2 కొరింథీ 5:10; ప్రకటన 22:12
2. శ్రమల కాలములో మనుష్యుని మతఆచారములపై తీర్పు. ప్రకటన 17 అధ్యాయము
3. శ్రమలకాలములో మనుష్యుని ఆర్థిక, రాజకీయ పద్ధతులపై తీర్పు . ప్రకటన 18 అధ్యాయము
4. శ్రమల కాలములో మనుష్యుని సైనిక పద్ధతులపై తీర్పు .ప్రకటన 19:11-21
5. శ్రమల కాలములో మనుష్యునిపై తీర్పు. ప్రకటన 6,8,9,16 అధ్యాయములు
6. ఇశ్రాయేలీయులపై దివిటీ మరియు తలాంతుల తీర్పు. మత్తయి 24:45-51; 25:1-30; యెహెజ్కేలు 20:33-38
7. అన్యులపై మేకలు మరియు గొఱ్ఱెల తీర్పు. మత్తయి 25:31-46
8. క్రీస్తు విరోధి (అంత్య క్రీస్తు) పై మరియు అబద్ధ ప్రవక్తపై తీర్పు. ప్రకటన 19:20
9. అగాధములో వెయ్యి సంవత్సరములు సాతాను బంధింపబడు తీర్పు. ప్రకటన 20:1-3
10. నిత్యనరకములో సాతాను యుగ యుగములు బంధింపబడు తీర్పు. ప్రకటన 20:10

11. పతనమైన దేవదూతలకు తీర్పు. 1 కొరింథీ 6:3; 2 పేతురు 2:4; యూదా 6

12. ధవళమైన మహా సింహాసనపు తీర్పు. ప్రకటన 20:11-15

## దేవుని అంగీకరించిన వారు

## పాత నిబంధనలోనివారు

1. హేబెలు. ఆదికాండము 4:4
2. అబ్రహాము. ఆది 12:1-3; 15:6
3. యాకోబు. ఆది 28:19-22
4. రాహాబు. యెహోషువ 2:9
5. రూతు. రూత 1:16
6. సమూయేలు. 1 సమూయేలు 3:1-10
7. దావీదు. 1 సమూయేలు 16:13
8. సారెపతు గ్రామమునకు చెందిన విధవరాలు. 1రాజులు 17:24
9. షూనేము పట్టణమునకు చెందిన స్త్రీ. 2 రాజులు 4:30
10. నయమాను. 2 రాజులు 5:14,15
11. మనష్షే. 2 దిన 33:10-13,18,19
12. కొరెషు. ఎజ్రా 1:2-4; యెషయా 44:28
13. నెబుకద్నెజరు. దానియేలు 3:28,29; 4:1,2,34, 35,37
14. దర్యావేషు. దానియేలు 6:25-27
15. నీనెవె పట్టణ రాజు. యోనా 3:5-9

## క్రొత్త నిబంధనలోని వారు.

1. ఒక శతాధిపతి. మత్తయి 8:10,13
2. మత్తయి. మత్తయి 9:9
3. ఒక కనాను స్త్రీ. మత్తయి 15:28
4. మరియొక శతాధిపతి. మత్తయి 27:54
5. సేన అను దయ్యములు పట్టినవాడు. మార్కు 5:15
6. రక్తస్రావ రోగము కలిగిన స్త్రీ. మార్కు 5:34
7. మూగ దయ్యము పట్టిన వాని తండ్రి. మార్కు 9:24
8. బర్తిమయి అను గ్రుడ్డి బిక్షకుడు. మార్కు 10:52
9. ఒక శాస్త్రి. మార్కు 12:34
10. మగ్దలేనే మరియ. మార్కు 16:9
11. పక్షవాయువు గల మనుష్యుడు. లూకా 5:20
12. పాపాత్మురాలైన ఒక స్త్రీ. లూకా 7:28
13. ఒక కుష్ఠ రోగి. లూకా 17:12-49
14. సుంకరి. లూకా 18:13,14
15. జక్కయ్య. లూకా 19:8
16. 18 సంవత్సరముల నుండి బలహీనపరచుచున్న దయ్యము పట్టిన స్త్రీ. లూకా 13:12,13
17. యేసుతో పాటు వ్రేలాడదీయబడిన నేరస్థుడు. లూకా 23:42
18. పేతురు. యోహాను 1:42
19. అంద్రెయ. యోహాను 1:40
20. ఫిలిప్పు. యోహాను 1:43
21. నతనయేలు. యోహాను 1:49
22. నీకొదేము. యోహాను 3
23. సమరయ స్త్రీ. యోహాను 4:29
24. ఒక ప్రధాని. యోహాను 4:53
25. వ్యభిచారమందు పట్టబడిన స్త్రీ. యోహాను 8:11
26. గ్రుడ్డివాడు. యోహాను 9:38
27. మార్త. యోహాను 11:27
28. పుట్టినది మొదలు కుంటివాడైన మనుష్యుడు. అపొ.కా. 3:8
29. ఇతియోపీయ నపుంసకుడు. అపొ.కా. 8:37
30. సౌలు. అపొ.కా. 9:6
31. కొర్నెలి. అపొ.కా. 10:44
32. సెర్గిపౌలు. అపొ.కా. 13:12
33. లూదియ. అపొ.కా. 16:14,15
34. దయ్యము పట్టిన బాలిక. అపొ.కా. 16:18
35. ఫిలిప్పీ చెరసాల నాయకుడు. అపొ.కా. 16:32-34
36. సమాజమందిరపు అధికారియైన క్రిస్పు. అపొ.కా. 18:8
37. అలెక్సంద్రియ వాడైన అపొల్లొ. అపొ.కా. 18:24,25

# సాక్ష్యము

**అంధకార జీవితము :** "వారి అవివేక హృదయము అంధకార మాయెను". రోమా 1:22. "భక్తిహీనుల మార్గము గాడాంధకారమ యము. తాము దేనిమీద పడునది వారికి తెలియదు". సామెతలు 4:19. ఆశ్చర్యకరుడగు దేవుడు అయోగ్యులను, అభాగ్యులను తనకు ప్రతినిధులుగనెన్నుకొని వన్నెకెక్కిం చును. దీనులైనవారు మాత్రమే దైవ సేవలో ఫలించి, ప్రకాశింతురు. నిజదేవుని శక్తిని నిరూపించిన ఆంధ్ర క్రైస్తవులలో బొల్లెద్దు జాను ప్రధమ శ్రేణికి చెందినవారు.

బొల్లెద్దు జానుగారు గుంటూరు జిల్లా పెనుమూడి గ్రామము నందొక పేద హరిజన కుటుంబమున 1896 సంవత్సరమున జన్మించెను. తండ్రి వెంకయ్య తల్లి వెంకట్రావమ్మ. తిరుపతి వెంకటేశ్వర్లు వరప్రసాదమున పుట్టినాడను నమ్మికతో అతనికి గోవిందు అను పేరు పెట్టబడెను. తిరుపతి వెంకటేశ్వర్లు మ్రొక్కుబడి యున్నందున తల వెంట్రుకలను కత్తిరింపక యుండిరి. తత్ఫలితముగ తలలో పేలు ప్రబలి బాలుడైన గోవిందును బహుగా బాధించెడివి. పూజలు, జాతరలు, భజనలు, సర్పపూజ, గొంతెమ్మ వేడుకలు మొదలగు కార్యక్రమములలో గోవిందు శ్రద్ధాసక్తులు కల్గి యుండెడివాడు.

బాల్య దినములలో పశువులను కాయుచుండగ బురద పాము కన్పించినను దానికి వంగి నమస్కరించి, లెంపలు వాయించుకొనుచు, "తల్లీ, నేను నీ జోలికి రాలేదు, నీవు నా జోలికి రావద్దు అని బ్రతిమాలు కొనువాడు. కొన్నిసార్లు రాత్రి సమయములందు ప్రకాశమానమైన దుస్తులు ధరించిన దేవదూతలాతని పడక చుట్టు తిరుగుచుండుటను గమనించి, తన వింతానుభవమును తల్లితో చెప్పగా దేవతలు నీకు అండగనున్నారులే, నాయనా అని ధైర్యపరచు చుండెడిది. ఈ రీతిగ దేవుడు బొల్లెద్దు జానును పసితనము నుండి తన దూతల కాపుదల క్రింద భద్రపరచుచు వచ్చెను. కృపామయు డగు దేవుడు తన్ను వెంటాడని ప్రజలను సయితము కాచి కాపాడును గదా!

గోవిందునకు చదువుకోవలెనను కోరికయున్నను, తల్లి దండ్రులతనిని బడికంపక పశువుల కాపరిగనే నియ మించిరి. అయినను విరామకాలమున వీధి బడికేగి, తెలుగు అక్షరములు మాత్రము నేర్చుకొనగల్గెను. కష్టపడి "క" గుణింతము వరకు చదివిన గోవిందును దేవుడు ఆశ్చర్యముగ దర్శించి, పండితులకు సైతము తేటతెల్లముగను, ధారాళముగను సత్యవాక్యమును బోధించగల భక్తునిగ రూపొందించెను. దేవునికి అసాధ్యమైన దేదియు లేదుగదా!

అవి బాల్య వివాహములు జరుగుచుండిన రోజులు గోవిందుకు పదమూడేండ్లు వయస్సు రాగానే తల్లిదండ్రులు పెనుమూడి వాస్తవ్యులు నీలవెంకయ్యగారి కుమార్తె బుల్లెమ్మ అను ఏడేండ్ల బాలికతో వివాహము జరిగించిరి. దేవుడు వారి వైవాహిక జీవితము నాశీర్వదించి, జూన్1వ తేది 1922వ సంవత్సరం ఒక కుమార్తెను ప్రసాదించిరి. కూతురుకు 'లూదియమ్మ' అను పేరు పెట్టబడెను. కుమార్తెకు యుక్తవయస్సు వచ్చిన మీదట 1937వ సంవత్సరం జూన్ 19వ తేదిన పెసర్లంక వాస్తవ్యులైన ప్రసాదరావుకిచ్చి పెండ్లిచేసిరి. దేవుడామెను ఆశీర్వదించి పదిమంది కుమారులను ఒక కుమార్తెను ప్రసాదించెను.

జాన్‌గారు పలుమార్లు దేవా, మాకొక కుమారు ననుగ్రహించుమని ప్రార్థించినను దేవుడాయెనకు ప్రత్యుత్తర ముగ 'లూదియమ్మ' ను మాత్రమే చూపించి ఆమె నాశీర్వ దించుచున్నట్లు, బయలుపరచేవాడట. ప్రేమగల దేవుడు జాన్‌గారి కుటుంబమును ఆశీర్వదించినందున కుమార్తెయు, అల్లుడు సువార్తసేవలో సాగుచు ప్రభువునందు ఆనందించు చుండిరి.

ఆ దినములలో క్రైస్తవ మతమున స్వీకరించిన వారు తెల్లదొరల ప్రాపకమును పొంది, ఉద్యోగస్థులై వర్ధిల్లుచుండుట గమనించిన 'గోవిందు' తన మతమును మార్చుకొన సంకల్పించుకొనెను. గోవిందు కోరికను మన్నించి ఆంధ్ర లూథరన్ మిషన్ వారాతని జుట్టును కత్తిరించి, బాప్తిస్మమిచ్చి

'జాన్' అను క్రొత్త పేరును పెట్టిరి. బుల్లెమ్మకు సువార్తమ్మ మారుపేరు పెట్టిరి. జాన్ క్రైస్తవ మతమును స్వీకరించెనేగాని, క్రీస్తును హత్తుకొననందున హృదయ పరివర్తనము లేనివాడై, నామకార్థపు క్రైస్తవ జీవితమును కొనసాగిచు చుండెను. క్రైస్తవారాధనలలో పాల్గొనుచును త్రాగుడు (ధూమపానము, మద్యపానము) అసహ్యకరమైన పోకిరి మాటలాడుట. అభ్యంతరకరమైన పాటలు పాడుట. నీతి బాహ్యమైన వీధినాటకము లాడుట మున్నగు పాపములకు దాసుడై యుండెను. తప్పత్రాగి నాటకములాడుట, జానుకెంతో ప్రీతిగ నుండెడిది. ఏడు ముంతలకల్లు ఏక ధాటిగా త్రాగువాడట!

రోత పుట్టించు జీవితములోనున్నను, అక్షర జ్ఞానము లేకున్నను, అతని విగ్రహపుష్టిని, పామర ప్రజలలోనున్న పలుకుబడిని, మొండి ధైర్యమును గుర్తించిన లూథరన్ మిషన్ వారు జానునొక లూథరన్ పాఠశాలలో ఉపాధ్యాయు నిగను, బోధకునిగను నియమించిరి. ఉపాధ్యాయుడుగ జాన్ తాను నేర్పవలసిన పాఠములను మొదట చేర్చుకొని పిల్లలకు నేర్పయత్నించువాడు. ఆదివారపు బడులలో శిక్షణ నిచ్చుట. ఆరాధన నడిపించుట తాను విధిగా నిర్వహించవలసి యున్నందున ఇతరులకు బోధించుటకుగాను బైబిలును చదువుట, పాటలు పాడుట మొదలగు ఆచారములను అలవరచుకొనెను.

పైకి భక్తిగల వానివలె నటించి, పెదవులతో క్రీస్తును ఘనపరచి ఆయన వాక్యమును బోధించుటయే గాని అతని హృదయము పాపపూరితమైయుండెను. తాను గ్రుడ్డివాడై యుండి, గ్రుడ్డివారికి దారి జూప ప్రయాస పడసాగెను. అతడు తన సంఘస్తుల ఆత్మీయ జీవితాభివృద్ధికి, తోడ్పడక పోగా వారిలో పార్టీలను పెట్టి, కక్షలను పెంచి, బూతులాడుచు, ప్రతివిధమైన అపవిత్రతను అత్యాసక్తితో జరిగించుచు, తన సంఘస్తులతో కలసి, మద్యపానము సేవించుచు, నాశనకర మైన మార్గమున నడుచుచుండెను. జీతమును సంపాదించు టకై విద్యాశాఖాధికారులకు లంచమిచ్చి, తన పాఠశాల సక్రమముగ పనిచేయుచున్నట్లును, విద్యాబోధన సంతృప్తి కరముగ నున్నట్లు మెప్పును పొందుచు, అన్ని విధముల మోసకరమైన జీవితమును కొనసాగించెను.

స్నేహితులతో కలసి తప్ప త్రాగుచు, తాత్కాలిక తృప్తి నొందినట్లు గడిపినను, వీధి నాటకములలో పాల్గొని ప్రేక్షకుల మెప్పును పొందుచున్నను పంతులుగారని పిలువ బడుట వలన ఘనతనొందినను, మానసికముగా కలత చెందుచు, కృంగిపోసాగెను. దుష్టులకు నెమ్మది యుండదని దైవ గ్రంథము సాక్ష్యమిచ్చు చున్నది గదా! నీతిగా జీవింప యత్నించువాడు గానీ శక్తి వలన సన్మార్గమున ప్రవర్తింప సాధ్యపడకపోయెను. పాప పాశముల నుండి విడుదల నొందుటకు ప్రయాసపడుచు, అంధమైన మనస్సు గల వాడై రహస్యముగ పాపపు జీవితమునే కొనసాగించువాడు. పాప ఫలితముగ శారీరక ఆరోగ్యము క్షీణించి, చలి జ్వరమునకు గురియాయెను. కంటిచూపు తగ్గెను. తత్ఫలితముగ బైబిలు చదువుట, బోధించుట మానివేయ వలసి వచ్చెను.

కృపానిధియైన దేవుడు పాప జీవితములో నోలలాడు చున్న జానును రక్షింప వేగిరపడుచు, మానక వెంటాడు చుండెను. వ్యాధి బాధలు ద్వారా మాటలాడసాగెను. అతడు తన పాప జీవితమును గూర్చి, పలుమార్లు తలపోయుచు, విడుదల నొంద నాశించువాడు గాని విమోచకుడని పాద సన్నిధి కేగక, స్వప్రయత్నములపై నాధారపడుచు, వ్యర్థముగ ప్రయాసపడు వాడు. తనపట్ల దైవోద్దేశమేమిటో తెలుసుకొన కుతూహలపడు వాడుకానీ, పాపము నుండి విడుదల నొందనందున అది సాధ్యమయ్యెడిది కాదు. కలల ద్వారాను, దర్శనముల మూలమునను దేవుడు తన కృపను ప్రత్యక్ష పరచుచున్నను, దైవాత్మకు లోబడలేదు.

ఒకసారి పెనుమూడి రేవులో నున్న పడవ నుండి పెద్ద కొండరాళ్ళను వెలుపలికి మోయుటకు జాన్ తన సహచరులతో కలిసి వెళ్ళెను. స్నేహితులతో గలసి చెడ్డపాటలు పాడుచు, రాళ్ళను మోయు వారికి రాళ్ళనెత్తుచుండెను. అంతలోనొక పెద్ద బండ ప్రక్కనున్నవాని పాదముపై బడెను.

ఆ బండను తొలగించుటకై వంగి ప్రయత్నించు నంతలో బండనెత్తుకొని నిలుపబడియున్న మరియొకని నెత్తిమీద బండజారి జాన్ కుడిచేతిపై పడెను. వెంటనే కుడిచేతి బొటనవ్రేలు తెగిపోయి రక్తము ప్రవహింపసాగెను. వెనువెంటనే వైద్యశాలకు కొనిపోబడి చికిత్స పొందెను.

పలుమార్లు ప్రాణాపాయములో నుండగ దేవుడాతనిని కనికరించి, కాపాడుచు వచ్చెను. అయినను జాన్ దేవుని కృపా బాహుళ్యమును నిర్లక్ష్యము చేయుచు, రక్షణను తృణీకరించుచు జీవింపసాగెను.

## ఉత్తరాలు

ప్రభువునందు ప్రియమైన ఎడిటర్‌గారికి వందనములతో వ్రాయునది: మా ఏరియాలో బ్లెస్సి లైబ్రరీ ప్రారంభించి యున్నాము. మీరు 'పరిశుద్ధత' ఆధ్యాత్మిక మాసపత్రికను పంపంచండి.

**బ్లెస్సి లైబ్రరీ, సురవరం పోస్ట్, శ్రీకాకులం జిల్లా**

మీరు క్రమము తప్పకుండా పంపిస్తున్న పరిశుద్ధత మాసపత్రిక మా ఆధ్యాత్మిక జీవితాలకు ఎంతో మేలుకరంగా ఉంది. మీకు మా కృతజ్ఞతలు. నాతో పాటు నా స్నేహితునికి కూడా చందా పంపిస్తున్నాను. దయచేసి ఇద్దరికీ పంపిం చండి. వందనములు

**పి. చిన్నారావు, బాప్టిస్టునగర్, విజయవాడ, కృష్ణాజిల్లా**

ప్రభువునందు ప్రియమైన దైవజనులు రెవ.కె.జోసఫ్‌గారికి నా హృదయపూర్వక వందనములు. నా పేరు కె.రెడ్డిమోహన్. నేను ఒక హత్యకేసులో జీవితఖైదు విధింపబడి కడప సెంట్రల్ జైల్లో ఉన్నాను. ఇక్కడికి వచ్చి నాలుగు సం॥లు అయింది. ఇక్కడ మీ పత్రిక చదివాను. ఇక్కడే రక్షణ పొందుకున్నాను. పత్రికలో బైబిల్ క్విజ్ ప్రశ్నలకు సమాధానాలు పంపుచున్నాను. నాకోసం నా విడుదల కోసం, నా కుటుంబ రక్షణ కొరకు ప్రార్థించగలరు.

**కె. రెడ్డిమోహన్, సి.టి.నెం.4530, సెంట్రల్ జైల్, కడప**

మీ ఉత్తరాలు మాకు పంపించాల్సిన చిరునామా:

**ఎడిటర్,**
పరిశుద్ధత ఆధ్యాత్మిక మాసపత్రిక
పోస్ట్‌బాక్స్ నెం. - 28
ఒంగోలు, ప్రకాశం జిల్లా

## బైబిల్ క్విజ్-11 జవాబులు

1. 6 లక్షలు
2. 430 సం॥లు
3. పస్కా పండుగ
4. అబీబు అను నెలలో
5. ఎఱ్ఱ సముద్రము
6. 3 దినములు
7. 2వ నెల, 15వ దినము
8. 6వ దినము
9. పూరేడులు
10. ఒక్కొక్క ఓమెరు
11. ఇదేమి?
12. హోరేబులోని బండమీద
13. యెహోవా నిస్సీ
14. మూడవనాడు
15. రెండంతలు
16. మూడుమారులు
17. 40 దినములు
18. ఊరీము, తుమ్మీము
19. నేను తప్ప వేరొక దేవుడు నీకుండకూడదు
20. విశ్రాంతి దినమును తప్పక ఆచరించవలెను
21. నరహత్య చేయకూడదు
22. 7 దినములు
23. బెసలేలు
24. 3000 మంది
25. మోషేతో



# అక్షరయజ్ఞం

**బైబిల్ క్విజ్ - 12**
నిర్గమ. 29 నుండి లేవీయ. 13 వరకు



**శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్**

1. కోడెను ఎక్కడ వధింపవలెనని దేవుడు మోషేతో చెప్పెను?
2. లెక్కింపబడిన వారిలో చేరు ప్రతివాడు యెహోవాకు ప్రతిష్ఠార్పణగా ఎంత ఇవ్వవలెను?
3. విశ్రాంతి దినమున పనిచేయు వానికి విధింపవలసిన శిక్ష ఏమిటి?
4. దేవునికి వ్యతిరేకముగా దూడను చేసిన తర్వాత ఎంతమంది చంపబడిరి?
5. ఇశ్రాయేలీయులు తమ ఆభరములను ఎక్కడ తీసివేసిరి?
6. సీనాయి కొండమీద మోషే దేవునితో ఎంతకాలము గడిపెను?
7. బెసలేలు తాతగారి పేరేమిటి?
8. మందిరమునకు పలకలను ఏ కఱ్ఱతో చేసెను?
9. దీపస్తంభమునకు ఎన్ని కొమ్మలు ఉంటాయి?
10. అహోలీయాబు ఏ గోత్రమునకు చెందినవాడు?
11. పరిశుద్ధ కిరీట భూషణము మీద వారు ఏమని వ్రాసిరి?
12. ప్రత్యక్షపు గుడారపు మందిరము ఎప్పుడు నిలువ బెట్టబడెను?
13. దహనబలిగా ఏ పక్షులను దేవునికి అర్పించాలి?
14. ఇశ్రాయేలీయులు అర్పించు ప్రతి అర్పణతో ఏమి చేర్చి అర్పింపవలెను?
15. తరతరములకు నిత్యమైన కట్టడగా ఏమి తినవద్దని దేవుడు ఆజ్ఞాపించెను?
16. అధికారి పొరపాటున పాపముచేసి అది తనకు తెలియబడిన యెడల అర్పణముగా ఏమి తేవలెను?
17. రెండు తెల్లగువ్వలైనను రెండు పావురపు పిల్లలైనను దొరకని యెడల పాపము చేసినవాడు ఏమి తేవలెను?
18. 6వ అధ్యాయములో 'అతి పరిశుద్ధము' అను మాట ఎన్నిసార్లు ఉంది?
19. 7వ అధ్యాయములో పేర్కొనబడిన జంతువులు ఏవి?
20. 8వ అధ్యాయంలో పేర్కొనబడిన సంఖ్యలు ఏమిటి (ఉదా: 3 దినములు, 4 పక్షులు)?
21. అహరోను తన కొరకు ఏ బలిని అర్పించెను?
22. ఎల్సాఫాను తండ్రి ఎవరు?
23. నెమరు వేయగలిగి రెండు డెక్కలు లేని జంతువులు ఏవి?
24. శుద్ధి దినములు ముగిసిన తరువాత స్త్రీ దహనబలిగా యాజకుని యొద్దకు ఏమి తేవలెను?
25. 13వ అధ్యాయంలో 'ఏడు దినములు' అని ఎన్నిసార్లు ఉంది?

గత నెల ప్రశ్నలకు జవాబులు వ్రాసిన వారు :

**బి. నెహెమ్యా,** చిన్నగంజాం, ప్రకాశం జిల్లా
**పి. చిన్నారావు,** బాప్టిస్టునగర్, విజయవాడ
**కె. రెడ్డిమోహన్,** సెంట్రల్ జైల్, కడప
**జె. జాన్‌పాల్,** అజ్జారం, ప॥గో॥ జిల్లా
**దాసరి బేబి,** ఇందిరాకాలనీ, ఒంగోలు

**గమనిక :** ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించవచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం. కావున ప్రతి ఒక్కరూ ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొని బైబిలు జ్ఞానము సంపాదించటంతో పాటు బహుమతులు గెలుపొందవలసినదిగా కోరుచున్నాము.